చందమామ
పిల్లల కథల మాసపత్రిక
M.T.V. Acharya
CHANDAMAMA
STORY MAGAZINE FOR THE Y

అట్టపీది బొమ్మ

కంసుడు మధురాపట్టణానికి రాజు. అతని చెల్లెలు దేవకి. కంసునికి చెల్లెలు అంటే చాలా ప్రాణం. అందుచేత ఆమె వివాహం చాలా గొప్పగా చేశాడు. ఆమె, ఆమె భర్త వసుదేవుడు ఎక్కిన రథాన్ని తనే నడుపుతున్నాడు.

ఊరేగింపు సాగుతూవుండగా ఒక అశరీరవాణి "ఓయీ కంసుడా! చూడగా నీవు వట్టి అమాయకునిలా ఉన్నావే. ఏ చెల్లెలిపయిన అభిమానపడి ఇప్పుడు రథాన్ని స్వయంగా తోలుతున్నావో, ఆ దేవకిదేవి కడుపున పుట్టే ఎనిమిదో శిశువు నిన్ను చంపి వేస్తాడు సుమా. ఏమరక, జాగ్రగా ఉండు!" అని పలికింది.

ఈ మాటలు చెవినిపడగానే మారు ఆలోచన లేకుండా కంసుడు చురున కత్తి దూసి, దేవకిని నరకబోయాడు. వసుదేవుడు అడ్డువచ్చి "బావా, నీకు నీ చెల్లెలు ఏమీ అపకారం చేయలేదుకదా. ఆమెకు పుట్టిన ఎనిమిదో బిడ్డకదా అపకారం చేసేది? అలాంటప్పుడు ఆమెకు పుట్టిన బిడ్డలనందరినీ నీకే వప్పగిస్తాము. నీ చెల్లెలిని వదలి పెట్టు" అని బతిమలాడాడు.

అప్పటికి కంసుని కోపం తగ్గింది. 'సరే'నని వప్పుకొన్నాడు. కొంత కాలానికి దేవకి కడుపున ఒక కొడుకు పుట్టాడు. మాటప్రకారం వసుదేవుడు కొడుకును కంసునికి ఒప్పగించాడు. కంసుడు వసుదేవుని నీతికి మెచ్చుకొని 'వద్దులే, తీసుకువెళ్లు' అన్నాడు. దీనికి వసుదేవుడు సంతోషించలేదు. ఏ నిమిషాన కంసుడి బుద్ధి మారుతుందోనని అతనికి అనుమానమే. ఇలా వసుదేవుడికి ఏడుగురు కొడుకులు పుట్టారు. వారినెవ్వరినీ కంసుడు తాకలేదు.

ఇంతలో ఒకనాడు నారదుడు కంసుడివద్దకువచ్చి, 'నందుడు, వసుదేవుడు, వారి పరివారమూ కలిసి నీ కుటుంబానికే ఊరూ పేరూ, లేకుండా చూడాలని ఏర్పాట్లు చేస్తున్నారు' అని చెప్పాడు.

ఇది వినేసరికి కంసుని హృదయంలో అణిగిపోయిన కోపం మళ్లీ రేగింది. దేవకి దేవికి పుట్టిన ఏడుగురు కొడుకులనూ కనికరంలేకుండా వెంటనే చంపి, చెల్లెలనూ బావనూ తన కోటలోనే బంధించివేశాడు.

ఎనిమిదో కాన్పుకి కేవలము విష్ణుమూర్తే దేవకి కడుపున జన్మించాడు. ఆ శిశువుకు విష్ణువుకి ఉన్నట్టుగానే నాలుగుచేతులూ, చేతులలో శంఖం, చక్రం, గద, పద్మమూ ఉన్నాయి. కుండలాలు, మణిహారము మొదలయిన అలంకారాలతో అతను ప్రకాశిస్తూవున్నాడు! దంపతులు బంధింపబడిన ఆ కోటలోనే విష్ణుమూర్తి వారికి ప్రత్యక్షమై, కంసుని చేతికి చిక్కకుండా శిశువును గోకులంలో వున్న నందుని యింటికి తీసుకుపొమ్మన్నాడు. దోవలో నీకేమీ యిబ్బందులు లేకుండా చూస్తానని చెప్పి మాయమయినాడు.


చందమామ
పిల్లల కధల మాసపత్రిక
FEB. '49
6
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టవీది బొమ్మ

చెరసాలలో వున్న దేవకీ వసుదేవులకు విష్ణుమూర్తి ప్రత్యక్షమయినట్టు కిందటిసారి చెప్పానుకదా. దేవకిదేవి ఆయనకు నమస్కరించి 'మహానుభావా! నిన్ను ఈస్వరూపంలో చూడడానికి మాకు శక్తిచాలదు. కనుక మానవరూపం తాల్చవలిసింది' అని కోరేసరికి, ఆమెకు పుట్టిన శిశువు మనలాగా మామూలు రెండుచేతులతోనే కనపడ్డాడు.

విష్ణుమూర్తి మహిమచేత వసుదేవుడి బేడీలు ఊడివచ్చినయి. చెరసాల తలుపులు వాటికవే తెరుచుకొన్నాయి. కావలివాండ్రు ఎక్కడివాళ్లు అక్కడనే మైకంతో పడి పోయారు. అప్పుడు శిశువును చేటలో పెట్టుకుని వసుదేవుడు గోకులం బయలుదేరాడు.

ఆ సమయాన గొప్ప తుపాను పట్టి హోరుమని వర్షం కురుస్తున్నది. అయితేయేం, వసుదేవుడికి దోవలో ఎట్టి యిబ్బందులూ కలగలేదు. వసుదేవుడిపైన ఒక్క చిను కయినా పడకుండా వేయిపడగలు విప్పి, ఆదిశేషువు అతనికి గొడుగు పట్టింది. గట్లు తెంచుకుని పొంగిపారుతున్న యమునానది రెండుగా చీలి ఆయనకు దోవ యిచ్చింది.

వసుదేవుడు గోకులంలో నందుని యింటికి చేరుకునేసరికి, గోపికలందరూ మంచి నిద్రలోవున్నారు. అందుచేత అతను, పిట్టకయినా తెలియకుండా తన మగశిశువును యశోద పక్కలో వేసి, ఆమె ప్రసవించిన ఆడశిశువును చేటలో పెట్టుకుని, తిరుగా మధురాపట్టణం చేరుకో గలిగాడు. తను తీసుకువచ్చిన ఆడశిశువును దేవకి పక్కలో ఉంచి, ఏమీ ఎరగనట్లు మళ్లీ బేడీలు తగిలించుకొని బంధంలో ఉండిపోయాడు.

గోకులంలో నందుడిభార్య యశోద, శిశువును కన్నదేకాని, పుట్టినది ఏమి శిశువో, విష్ణు మాయవలన గమనించలేకపోయింది. అక్కడ ఉన్నవారందరూ 'మా యశోదమ్మకు మగపిల్లవాడమ్మా, ఏ మదృష్టమమ్మా!'అని సంబరంపడినారే కాని, అసలు రహస్యం ఒక్కళ్ళకూ తెలియదు.

అసలింతకూ, యశోద కడుపున పుట్టి, దేవకి ఒడిలో పెరుగుతున్న ఆడశిశువు ఎవ రనుకున్నారు?- ఆ చిత్రకథ వచ్చేనెల చందమామలో చదవండి.

చందమామ

పిల్లల కధల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

యశోద కడుపున పుట్టి, దేవకీదేవి ఒడిలో పెరుగుతున్న ఆడశిశువు మామూలు మానవశిశువు కాదు. ఆమె యోగమాయ. అనగా దుర్గాదేవి. విష్ణుమూర్తి అజ్ఞ ప్రకారం ఆమె యశోద కడుపున జన్మించింది.

దేవకీ వసుదేవులకు పుట్టిన ఏడుగురు బిడ్డలనూ దయా దాక్షిణ్యమూ లేక, కంసుడు చంపివేసి, ఎనిమిదో బిడ్డ ఎప్పుడు పుడతాడా అని ఆత్రంతో వున్నాడు.

యశోదకు పుట్టిన శిశువును వసుదేవుడు గోకులంనించి తెచ్చి దేవకి పక్కలో వుంచగానే ఆ బిడ్డ కెవ్వున ఏడ్చింది. బిడ్డఏడుపు చెవుల బడగానే కాపాలావాళ్లు పరుగెత్తిపోయి కంసునితో చెప్పారు.

కంసుడు గబగబ చెరసాలలోకి వచ్చి, దేవకి ఒడిలోయున్న బిడ్డను చర్రున లాగుకొన్నాడు. "అన్నయ్యా! మగశిశువు అయితేకదా, నీకు వానివల్ల భయము? ఇది ఆడశిశువాయె. వృథాగా చంపితే నీకు ఏమి కలిసివస్తుంది? నాపయిన దయవుంచి, ఈ బిడ్డనయినా బతకనీ" అని దేవకి అనేకవిధాల బతిమాలింది.

అతను అదేమీ వినిపించుకొనక, ఇదివరకులాగానే ఈ శిశువునుకూడా పైకి ఎత్తి రాతికివేసి కొట్టబోయాడు. కాని, శిశువు అతని చేతులకు దొరకకుండా జారిపోయి, దివ్య తేజస్సుతో ఆకాశమార్గానికి ఎగిరిపోయి, నిజస్వరూపం తాల్చింది.

ఎనిమిది చేతులతో, ప్రతి చేతులలోనూ శంఖం, చక్రం, ధనుస్సు, శూలం మొదలయిన ఎనిమిది ఆయుధాలతో నిజస్వరూపంలో ప్రత్యక్షమయిన ఆ యోగ మాయను చూచి అందరూ ఆశ్చర్యపోయారు. పైకి ఎగిరిపోయిన ఆ దేవి కంసునితో—"ఓయి పిచ్చివాడా! నువు చేసిన కట్టుదిట్టములు ఎందుకు పనికి వస్తాయి? నిన్ను చంపటానికి అవతరించే కృష్ణుడు అప్పుడే పుట్టి, వేరొకచోట పెరుగుతూనే వున్నాడుసుమా!" అని అంటూ, అదృశ్యమయిపోయింది!

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1ST APRIL '4
6
as.
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

'కృష్ణుడు పుట్టి పెరుగుతున్నాడు' అని యోగమాయ చెప్పినప్పటినించీ కంసునికి గుండెలో గుర్రాలు పరుగులు పెడుతూనే వున్నాయి. ఎలా అయినా సరే కృష్ణుణ్ణి పట్టి చంపితేకాని తన ప్రాణగండం తప్పదని అతను నిశ్చయించుకున్నాడు.

ఆ ప్రకారం ఆనాడే భటులను పంపి గోకులంలో పుట్టి పెరుగుతున్న బాలురందరినీ చంపమన్నాడు. అలాగే భటులు పోయి గోకులంలో ప్రతి యిల్లూ వెతికి బాలకులందరినీ చంపారు. అయినా ఇంకెక్కడయినా దిగుబడి ఉంటారేమోనని కంసుడికి అనుమానం వేసింది.

అందుకని, పిల్లలను చంపటంలో నేర్పరి అయిన పూతనను ఈ పనికి నియమించాడు. పూతన పల్లెపల్లెలు వెతుక్కుంటూ, కంటపడిన శిశువులనందరనూ చంపివేస్తూ చివరకు, గోకులం చేరుకుంది. కృష్ణుడు నందుడి యింట్లో పెరుగుతున్నట్టు తెలుసుకొని, ఒక అప్సరస రూపంతో నందుని ఇంట ప్రవేశించింది. మామూలు మానవ స్త్రీ లాగనే కనబడటంచేత, ఆమెను ఎవరూ అడ్డుపెట్టలేదు.

"అమ్మా, నా ముద్దుల కృష్ణుడేడీ! చిన్నారి కృష్ణుడేడీ!! ఒక్కసారి ఎత్తుకోనీయండమ్మా!!!" అంటూ పూతన శిశువును అభిమానంతో ఒడిలోకి తీసుకొని, ఎంతో ప్రేమతో తన విషపురొమ్ములతో బాలునికి పాలివ్వ నారంభించింది.

ఇంట్లోవాళ్ళు తెలుసుకోలేక పోయారు గాని, కేవలమూ పరమాత్ముడే అయిన కృష్ణునివద్ద పూతన మాయలు పనికివస్తాయా?—పూతన పాలు తాగుతూవున్న మాయల కృష్ణుడు, పాల ధారలతోపాటు ఆమె జీవధారలను కూడా పీల్చివేశాడు.

మరణవేదన భరించలేక, 'అమ్మోయ్, బాబోయ్!' అంటూ పూతన, భూమీ ఆకాశమూ దద్దరిల్లేటట్టు బొబ్బలెట్టుకుంటూ, నిజరూపంతో పర్వతంలాగ నేలని కూలింది. ఆ పెద్ద కళేబరంపయిన కూర్చుని, భయంలేకుండా బాల కృష్ణుడు ఆడుకొంటున్నాడు. అప్పుడు అందరూ, ఆ అప్సరస పూతన కదా అని పోల్చుకొని, బాలకృష్ణుని అద్భుత లీలలకు ఆశ్చర్యపోయారు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక

అట్టమీది బొమ్మ

కృష్ణుడు పుట్టిన సంగతి తెలిసినప్పటినించీ, వానిని ఏవిధంగా చంపటమా అని కంసుడు ఆవేదన పడుతూనేవున్నాడు. రాక్షసగణంలో తెలివయిన వాళ్లనూ, నేర్పుకలవాళ్లనూ ఇందుకు నియమించాడు. ఎన్నో మాయోపాయాలతో వాళ్లు కృష్ణుణ్ణి చంపాలని చూశారు. కాని, అవతారమూర్తి అయిన కృష్ణుణ్ణి వాళ్లు ఏమి చేయలేకపోయారు. వాళ్లందరూ కృష్ణుని చేతిలోనే చచ్చారు.

కంసుడు పంపినవాళ్లలో తృణావర్తుడు అనే రాక్షసుడు చెప్పుకోతగ్గవాడు. వీడు కృష్ణుని చంపటానికి వేసిన వ్యూహం చాలా చిత్రమయింది.

ఒకరోజున, కృష్ణుణ్ణి తొడపయిన కూర్చోపెట్టుకొని, యశోద ఆడిస్తున్నది. ఆ సమయంలో, తృణావర్తుడు భయంకరమైన సుడిగాలి రూపం తాల్చాడు. గోకులపట్టణమంతా ధూళి రేగిపోయి, మనిషికి మనిషి కనపడకుండా పోయారు. అటువంటప్పుడు రాక్షసుడు, బాలకృష్ణుణ్ణి పైకంటా ఎగరవేసుకు పోయాడు. తనను బాగా ఎత్తునకు తీసుకుపోనిచ్చి, మాయలకృష్ణుడు తృణావర్తుణ్ణి గట్టిగా పట్టుకుని బరువెక్కటం ప్రారంభించాడు. ఆ బరువు భరించలేక, తృణావర్తుడు కృష్ణునిపట్టు తప్పించుకుందామని గింజులాడాడు. కాని, కృష్ణుడు పట్టు వదలలేదు.

కృష్ణుని భారానికి తృణావర్తుడు తట్టుకోలేక, నిజస్వరూపంతో చాపకట్టుగా నేల కూలి ప్రాణాలు విడిచాడు.

ఈవిధంగా కృష్ణావతారంలో భగవంతుడు, పరమ దుర్మార్గుడైన మరిఒక రాక్షసుని సంహరించి, లోకానికి మేలుచేశాడు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1ST JUNE '49
6
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

చిన్నారి కృష్ణుడు గోకులంలో నందుని ఇంట పెరుగుతూ వున్నట్టు చెప్పాముకదా! ఒక యేడు వచ్చినకొద్దీ, కృష్ణుడు బుద్ధిమంతుడు కావటానికి బదులు పెంకెవాడుగా మారిపోతున్నాడు. అతను చేసే చిలిపి చేష్టలకూ అగడాలకూ అంతూ పొంతూ లేకుండా వుంది.

గోకులంలో గోపికలు, సరీగా పాలు పిదుకుకొనేవేళకు పోయి కృష్ణుడు లేగలను విడిచిపెట్టివేస్తాడు. అతను తనవెంట కోతిమూకను వెంటబెట్టుకు వెళ్లి గోపికలు దాచుకొన్న పాలు, పెరుగు, వెన్న తను తిన్నంత తిని మిగిలినది వాటికి మేపుతాడు. అవి తినకపోతే ఆ కుండలు పగులగొట్టి వేస్తాడు.

ఒకవేళ కుండలు ఎత్తున వుండి అందకపోయినట్టయితే అతను రోలు వేసుకొని ఎక్కుతాడు. లేదా, ఒకళ్ల వీపుమీద ఒకళ్ళను నిలబెట్టి కృష్ణుడు కుండలు తీసి పాలు, పెరుగు వెన్న దొంగిలిస్తాడు. గోపికలు వచ్చి తనను పట్టుకోబోతే కుండలో వెన్న తీసి వాళ్లమొహాన కొట్టి, నేలని విసిరేస్తాడు.

గోపికలందరూ కలిసి యశోదవద్దకు వెళ్ళి 'అమ్మా! నీ ముద్దుల కుమారుడు చేసే అగడాలు చూశావుటమ్మా! మమ్మలిని ఒక్కనిమిషమైన బతకనీయటంలేదు. దొంగ కృష్ణుడు! పెంకె కృష్ణుడు!!—ఇలా అయితే మేము ఎక్కడికయినా పోతామమ్మా!' అని చాడీలు చెప్పేవారు. ఇవన్నీ విని తల్లి యశోద, కొడుకుని మందలించలేక చిరునవ్వుతో 'సరే, కోప్పడతా లెండి' అని చెప్పి వాళ్ళను సద్దిపుచ్చి పంపివేసేది.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక

1ST JULY

6

CHANDAMAMA: STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

గోకులంలో బాలకృష్ణుని బతుకు దినదిన గండమయిపోయింది. ఎలుక కోసం పొంచివున్న పిల్లిలాగ, కృష్ణుని చంపటానికి కంసుడు ఎన్ని ఎత్తులైనా వేస్తూనే వున్నాడు. కంసుని ఆజ్ఞప్రకారం మాయ పూతన తన విషపు పాలిచ్చి కృష్ణుని చంపబోయింది. బండిరూపంలో వచ్చి, శకటాసురుడు కృష్ణుని చంపటానికి యత్నించాడు. ఎత్తుకంటా ఎగరవేసుకపోయి, కృష్ణుని చంపుదామని తృణావర్తుడు వాయురూపం తాల్చాడు.

ఇన్ని గండాలు చుట్టుకున్నప్పటికీ, ఆ విష్ణుమూర్తి దయవల్లనే అవన్నీ తొలగిపోతూ వచ్చాయి. కాని, ఇలా భయంతో ఎన్నాళ్లు బతకటం? ఈ ప్రశ్నను ఊరి పెద్దలంతా కలిసి ఆలోచించారు. అందులో ఒక బుద్ధిమంతుడు—

"అబ్బాయిలూ! ఈ వూరిలో మన కష్టాలు గట్టెక్కే దారి కనపడదు. స్థలం మార్చినట్టయితే మేలు కలుగుతుందని శాస్త్రజ్ఞులు చెప్పుతున్నారు. ఇక్కడికి కొద్దిదూరంలో, బృందావనం అనే ప్రదేశం ఉన్నది. ఆ కొండలూ, నదులూ, పచ్చికబయళ్లూ కనుపండువుగా వుంటాయి. పైగా, మన పశువులకు కావలసినన్ని గోభూములున్నయి. అన్ని సదుపాయాలూ గల బృదావనం వాసయోగ్యమైందనీ, మనకు క్షేమకరమైందనీ నా వుద్దేశం" అని చెప్పాడు.

ఈ ఉపాయం విని అందరూ "భేష్! భేష్!!" అని పొంగిపోయారు. ఆ వెంటనే గోకులంలో ఉండే బళ్లన్నీ సిద్ధమైనయి. పిల్లలూ, వృద్ధులూ, ఆడవాళ్ళూ బళ్లెక్కారు. మరికొన్ని బళ్లల్లో సామానులు నింపారు. భజనలతో బాజా భజంత్రీలతో, హరినామస్మరణ చేసుకొంటూ గోపులు, గోపికలతోసహా, గోకుల ప్రజలు బృందావనానికి బయలుదేరారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
CHANDAMAMA: STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

గోప, గోపికలతో సహా గోకులం ప్రజలందరూ బృందావనం చేరుకున్నారని కిందటిసారి చెప్పాము. బృందావనం చక్కటి ప్రదేశం. ఎక్కడ చూచినా పంట పొలాలే. ఎక్కడ చూచినా పచ్చిక బీడులే. ఏ పక్క చూచినా గోవర్ధనగిరివంటి కొండలూ, లోయలూ, ఎల్లప్పుడూ ప్రవహించే జీవనదులూ — వీటన్నిటితోనూ బృందావనం కలకల్లాడుతూవుంటుంది.

అటువంటి బృందావనంలో శ్రీకృష్ణుడు పొన్నచెట్టుపైన కూరున్చి మురళి వాయిస్తూ ఉండేవాడు. చిన్నారి కృష్ణుడు వాయించే ఆ మురళి పాట వినటానికి గోపులూ, గోపికలూ అందరూ అతనిచుట్టూ గుమిగూడేవారు. ఆ మురళిగానం విని తన్మయులైపోయేవారు.

చిన్నారి కృష్ణుడు మురళి వాయిస్తూవుంటే, పశువులు, లేగలు మేత మానివేసి వచ్చి అతని పాట వినేవి. ఆ పాటకు ఉత్సాహంకొద్దీ నెమిళ్లు పురివిప్పి నృత్యంచేసేవి. ఆదిశేషువులు ఆలకించటానికి వచ్చేవి.

ఈవిధంగా చిన్నారి కృష్ణుడు, వెన్నెల రాత్రులలో, యమునానదీ తీరాన మురళి వాయిస్తూ గోపులతో, గోపికలతో కలిసి నృత్యం చేసి, వినోదించేవాడు. శ్రీకృష్ణుడు చేసే నృత్యాలలో 'రాసక్రీడ' ఎక్కువ ఆనంద మిచ్చేది. ఈవిధంగా, అవతారమూర్తి అయిన శ్రీకృష్ణుని సమక్షమందు ఉన్నంతసేపూ బృందావనంలో ఉండే పిల్లలూ, పెద్దలూ మాత్రమే గాక, పశుపక్ష్యాదులు సయితం పరవశత్వం చెంది ప్రపంచమే మరిచిపోయేవారు.

చందమామ
పిల్లల కథల మాస పత్రిక
1ST SEPT. 49
6
as.
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

గోకుల ప్రజలు బృందావనం చేరుకొన్నప్పటినించీ సుఖంగానే ఉంటున్నారని అనుకొన్నాము. కాని, స్థలం మారినప్పటికీ మన చిన్నారి కృష్ణునికి మాత్రం గండాలు తప్పనేలేదు.

ఒకనాడు ఏమి జరిగిందంటే—శ్రీ కృష్ణుడు, అతని అన్న బలరాముడు, పసులకాపరులు, అందరూకలిసి ఆవులను అడవులకు తోలుకొనిపోయారు. ఆ రోజున ఎండ మండిపోతూవుంది. తాము దాహం తీర్చుకొని, ఆవులకు నీళ్లు పెట్టుకు రావచ్చుకదా అని చెప్పి, వాళ్లు దూరాన ఉండే చెరువుకి పోయారు.

ఆ చెరువుదగ్గర బకాసురుడనే రాక్షసుడు కొంగరూపంలో ధ్యానంచేస్తూ కూర్చునివున్నాడు. వీళ్ళందరూ కంటబడేవరకు, దొంగధ్యానంలో వున్న బకాసురుడు పొడవుపాటి ముక్కులు విచ్చుకొని, హంమ్మంటూ వచ్చి చిన్నారి కృష్ణుణ్ణి ఒక్క గుటకలో కబళించివేశాడు. బలరాముడూ తక్కినవాళ్లూ ఈ దృశ్యం చూడలేక మూర్ఛపోయారు.

అప్పుడు అవతార పురుషుడైన శ్రీ కృష్ణుడు తన తేజస్సు నంతటినీ ప్రళయాగ్నిగా మార్చివేశాడు. ఆ తాపం భరించలేక బకాసురుడికి గొంతుకాలి, ఉక్కిరి బిక్కిరి అయి, తను మింగిన కృష్ణుణ్ణి 'ఓక్' మంటూ డోకివేశాడు. ఇవతలపడిన కృష్ణుణ్ణి తన ఇనుపముక్కులతో పొడిచి చంపుదామని బకాసురుడు ప్రయత్నించేటంతలో, చిన్నారి కృష్ణుడు మందహాసంతో బకాసురుని రెండు ముక్కులూ తన రెండు చేతులతోనూ పట్టి, తాటిమట్ట చీల్చినట్టు నిలువునా చీల్చివేసేవరకు, ఆ మాయకొంగ రెండు పాయలై, చచ్చి నేలని కూలింది. ఈ విధంగా కృష్ణునిచేతిలో మరొక దుష్ట రాక్షస సంహారం జరిగింది.

చందమామ
పిల్లల కథల మాస పత్రిక
1st OCT. '49
6
CHANDAMAMA - STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

అందమైన బృందావనంలో బలరాముడూ శ్రీకృష్ణుడూ గోపాలకులుగా వుండి, ఆ అడవులవెంట గోవులను తోలుకొనిపోయి, మేపుతూ ఉండేవారు. గోపులతోనూ గోపికలతోనూ కలసి ఆడుకోవటమూ, గోవులను మేపడమూ వారికి సరదాగా ఉండేది.

ఇలావుండగా ఒకరోజున శ్రీదమనుడు, సుబాలుడు, స్తోకుడు మొదలైన చెలికాండ్రు బలరామకృష్ణులవద్దకువచ్చి, "కృష్ణా, కృష్ణా! మన ఈఅరణ్యానికి సమీపంలోనే తాటిచెట్లు కోకొల్లలుగా ఉన్నాయి. ఆ తాటిపళ్ల పరిమళం ఇక్కడికికూడా వేస్తున్నది. అవి తింటే ఎంత రుచిగా ఉంటాయనుకొన్నావు? కాని, ధేనుకాసురుడనే ఒక రాక్షసుడు గాడిద రూపంలో అక్కడ కాచుక్కూచుని, ఎవరినీ ఆ పండ్లు తాకనివ్వటంలేదు." అని చెప్పారు.

ఈ సంగతి వినడంతోనే, బలరాముడూ, శ్రీకృష్ణుడూ బయల్దేరి అక్కడకు వెళ్లారు. బలరాముడు తాటిచెట్లను పట్టి ఊపేవరకు, జలజలమంటూ వందలూ వేలూ తాటిపండ్లు నేలమీద రాలినై. ఈ అలజడి చెవినిపడగానే, గాడిదరూపంలోవున్న ధేనుకాసురుడు పరుగిడుకొంటూ ఎగేసుకువచ్చి, వెనుక కాళ్లతో బలరాముణ్ణి పడపడమని తన్ననారంభించాడు. 'బే! బే!!' అని అరచుకొంటూ, మళ్లీ ఎక్కువ వేగంతో రెండవసారి బలరామునిమీదికి వచ్చేవరకు బలరాముడు దాని వెనుకకాళ్లు రెండూ రెండు చేతులతో పట్టుకొని, గిరగిర తిప్పికొట్టి, ఆకాశానికంటా ఎగురవేశాడు. ఆ గాడిద గాలిపటంలాగ తిరిగి తిరిగి, దభీమని నేలమీదపడి చచ్చింది.

ఈవిధంగా రాక్షసగణంలో ఎన్నతగిన ధేనుకాసురుడు సంహరింపబడటంతో రాక్షసమూక అందరూ బిలబిలమంటూ వచ్చి ఎదురుతిరిగారు. అప్పుడు బలరామ కృష్ణులు వాళ్లందరనూ తుక్కుతుక్కుగా కొట్టి చంపారు.

ఇదిచూచి ప్రజలంతా సంతోషించారు. దేవతలు దుందుభులుమ్రోగించారు.

చందమామ

పిల్లల కథల మాస పత్రిక



1st NOV '49

6

CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

క్రిందటిసారి, ధేనుకాసురుడనే రాక్షసుణ్ణిగురించి చెప్పాము. ధేనుకాసురుడూ, వాని బంధువర్గమూ నాశనమైపోయినప్పటికీ, ఇంకా ఎంతో మంది రాక్షసులు జీవించేవున్నారు. వాళ్ళందరూ శ్రీకృష్ణ, బలరాములమీదికి ఎప్పుడువెళ్లుదామా అని, సమయంకోసం నిరీక్షిస్తూవున్నారు.

శ్రీకృష్ణుడు చంపినవాళ్ళలో ధేనుకాసురునితరువాత, అఘాసురుడు చెప్పుకో తగ్గవాడు. అఘాసురునికి మేనమామ ఒకడున్నాడు. వానిపేరు అరిష్టాసురుడు. "అరే, చూడబోతే నా వేలంత లేడు. ఈ కృష్ణుడు నామేనల్లుని చంపుతాడా? వీనిపని పడతానుండు" అంటూ, అరిష్టాసురుడు శ్రీకృష్ణునిమీద కసిపూనాడు.

కసిపూనిన అరిష్టాసురుడు, ఒక ఆబోతురూపం ధరించి, వాయువేగంతో కృష్ణునిమీదికి భయంకరంగా తలపడ్డాడు. అపురూపమైన ఆ ఆంబోతు అకస్మికంగా వచ్చేవరకు, ఎక్కడి గోవులు అక్కడనే పరుగుచ్చుకొని ప్రాణం దక్కించుకోబోయినయి. గోపులందరూ కంగారెత్తి కాలికి బుద్ధిచెప్పారు. గోపికలు నిస్సహాయస్థితిలో "కృష్ణా! ఆపదోద్ధారకా!! రక్షించు, రక్షించు!!" అంటూ చేతులెత్తి మ్రొక్కారు.

అప్పుడు అవతారమూర్తి శ్రీకృష్ణుడు, ఆబోతుయొక్క వాడికొమ్ములు రెండిటినీ తన రెండుచేతులతోను పట్టి, తమలపాకుతొడిమ తీసివేసినట్టుగా, దాని కుడికొమ్మును పళక్కన విరిచివేసేవరకు, నెత్తురు వరదలుగా ప్రవహించింది.

ఆ విరిచిన కుడికొమ్ముతోనే శ్రీ కృష్ణుడు అరిష్టాసురుణ్ణి చితుకగొట్టి పొడిచేసరికి, ఆ బాధకు తాళలేక, మరికొంచెముసేపటికే గిలగిల తన్నుకొంటూ రాక్షసుడు ప్రాణాలు విడిచాడు. దుష్టసంహారంకోసం జన్మించిన శ్రీకృష్ణుని చేతులో ఈ విధంగా అరిష్టాసురుడుకూడా మృతిపొందాడు.



CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

పూర్వకాలమందు పాములన్నీ గరుత్మంతుణ్ణి పూజిస్తూ వుండేవి. కాని నాగులలో గర్వి ఐన కాళింగుడు మాత్రం అలా పూజచేయక నిరసించేవరకు, గరుత్మంతునికీ కాళింగునికీ మధ్య పేచీపడి, యుద్ధంజరిగింది. ఆ యుద్ధంలో కాళింగుడు ఓడిపోయాడు.

యమునానది జలం తాకినట్లైతే మరణం సంభవిస్తుందని గరుత్మంతునికి ఒక ఋషి శాపం ఉన్నది. కనుక గరుత్మంతుడు ఎన్నడూ ఆ నదిచేరువకు పోయేవాడుకాదు. ఈకీలకం తెలిసిన కాళింగుడు కుటుంబంతోసహా యమునా నది చేరుకొని, అక్కడ ఒక లోతైన మడుగులో కాపురం పెట్టాడు.

ఐతే - కాళింగుడు ఇక్కడకు వచ్చినప్పటినించీ ఆ నదీజలమూ, అక్కడి గాలీకూడా విషపూరితమై, బృందావనంలోని ప్రాణికోటి చచ్చి పోజొచ్చిందీ. అందుచేత గోకులంలో ప్రజలంతా తహతహలాడిపోయారు.

అప్పుడు శ్రీకృష్ణుడు కాళింగుడు ఉండే మడుగువద్దకు వెళ్ళి, అక్కడ ఒక కదంబవృక్షం ఎక్కి, గభీమని మడుగులో పలికి దూకి, కాళింగుని నడుంమీద పడ్డాడు. కాళింగుడు రోషపూరితుడై తన వేయిపడగలూ విప్పుకొని, బుస్సుమంటూ నీటిపైకివచ్చి కృష్ణుణ్ణి కదలకుండా చుట్టబెట్టేసరికి, అక్కడ వున్న గోవులన్నీ బావురుమంటూ ఏడిచాయి. అందరూ స్మృతితప్పిపోయారు.

కాని, అంతలోనే కృష్ణుడు అపారంగా బరువెక్కి కాళింగునిపైన నృత్యం చేసి మర్దించేవరకు,. కాళింగుని నడుము లటుక్కుమని, కృష్ణుణ్ణి పట్టు వదిలేసింది. అప్పుడు కాళింగుని భార్యలిద్దరూ వచ్చి, 'కటాక్షించి, మాకు పతిభిక్ష పెట్టు దేవా!' అని అవతారమూర్తిఅయిన కృష్ణుణ్ణి వేడుకొన్నారు.

శ్రీకృష్ణుడు అప్పుడు "ఓయి కాళింగా! ఇప్పుడు నా పాదాలు నీ తల పయిన ముద్రపడి ఉన్నవి. గనుక, ఇవి చూచినట్టయితే గరుత్మంతుడు నిన్ను ఏమీ చేయడు. అతని భయం నీకు ఉండదు. కనుక, నీవు ఇదివరకు నివసిస్తూవుండిన రమణకద్వీపానికి వెంటనే వెళ్ళిపో," అని అనేవరకు, కాళింగుడు కుటుంబముతోసహా యమునానదివిడిచి స్వస్థలానికి వెళ్లిపోయాడు.



పిల్లల కథల మాసపత్రిక
JAN. 50
1950

అట్టమీది బొమ్మ

బృందావన ప్రజలు ఒకప్పుడు, ఇంద్రునికి యజ్ఞం చేయాలని సన్నాహంలో ఉన్నారు. అది చూచి శ్రీకృష్ణుడు నందునితో "నాయనా! ఈ హడావిడి అంతా ఏమిటి ?" అని అడిగాడు.

అందుకు నందుడు "బిడ్డా! వర్షానికి అధిపతి ఇంద్రుడు. ఆయనకు యజ్ఞంచేసి సంతోషపెట్టితిమంటే, వానలు కురిపిస్తాడు. వానలు కురిస్తే పంటలు పండుతై. పంటలు పండితే ప్రజలు సుఖిస్తారు" అని బదులు చెప్పాడు.

ఇది విని కృష్ణుడు "ఇదేమిటి ఈ అవివేకం! గోవులూ, పర్వతరాజు ఐన గోవర్ధనగిరి—ఇవే మన దేముళ్లు. వీటినే మనం పూజించుకోవాలి. అంతే గాని, ఎక్కడోవున్న ఇంద్రుడికి యజ్ఞంచేయడమా? ఆయన మనకు వర్షం కురిపించడమా ?" అని వారిని నిరుత్సాహపరిచాడు.

ఈ విధంగా తన యజ్ఞం మాన్పించేవరకు, ఇంద్రునికి మండుకొచ్చి, బృందావన ప్రజలకు శాస్తి చేయాలని నిశ్చయించుకొన్నాడు. అతని అజ్ఞ ప్రకారం, అకస్మికంగా మేఘాలు కమ్మేసి, ఉరుములతో, మెరుపులతో, పిడుగులతో, పెనుగాలితో ఘోరమైన వడగండ్ల వాన ప్రారంభించింది.

అప్పుడు అవతారమూర్తి ఐన కృష్ణుడు బ్రహ్మాండమైన గోవర్ధనగిరిని చేతి చిటికెనవేలితో, గొడుగు ఎత్తినట్టు అవలీలగా ఎత్తి పట్టుకొని, ప్రజలతో "మీకు వచ్చిన భయమేమీ లేదు. ఇలా వచ్చేసెయ్యండి. ఇంద్రుడు ఏమి చేయగలడో చూస్తా" నంటూ, అందరనూ కొండకిందికి చేరదీసుకొన్నాడు.

ఈ భీభత్సం ఏడు రోజులపాటు సాగించగలిగాడు ఇంద్రుడు. గోవర్ధనగిరి కదలకుండా కృష్ణుడు అలానే పట్టి ఉంచేవరకు, ఇంద్రుడు భూలోకానికి దిగివచ్చి, కృష్ణుని పాదాలమీద పడి క్షమాపణ కోరుకొన్నాడు. అంతటితో, అధికారగర్వంతో మిడిసిపడుతూవున్న ఇంద్రునికి గర్వపరిహార మైంది.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
MAR. '50
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

చందమామ

పిల్లల కథల మాసపత్రిక

సంచాలకుడు: చక్రపాణి

సంపుటి 6 | మార్చి 1950 | సంచిక 3

అట్టమీది బొమ్మ

ఒకనాడు, గోపికలందరూ కలసి "కృష్ణా! క్రీడలన్నిటిలో గొప్ప ఆనందమిచ్చే 'రాసక్రీడ' ఆడుకుందాము, రావలిసింది" అని కోరారు. అందుకు కృష్ణుడు "అలాగే ఆడుదాము; శరత్కాలంవరకూ వేచిఉండండి" అని చెప్పాడు.

ఇంతలో శరదృతువు వచ్చేసి భూలోకమంతా పచ్చటిచేలతో, రంగురంగుల పువ్వులతో, అందరకూ ఆనందదాయకంగా వున్నది. ఇటువంటిసమయంలో, పుచ్చపువ్వువంటి వెన్నెల కాస్తూవుండగా, చిన్నారికృష్ణుడు ఒక రోజున తన మురళి వాయించుకొంటూ ఒక అందమైన వనంలోకి వెళుతున్నాడు. గోపికలందరూ ఆ మురళీధ్వనికి తన్మయులై "ఎక్కడ, ఎక్కడ, ఈగానం?" అనుకొంటూ కృష్ణునివెంట పడ్డారు.

కృష్ణుడు,చిరునవ్వుతో "ఇదేమిటి, రాత్రిపూట మీరు ఒంటరిగా రావచ్చునా? మీ భర్తలకుతెలిస్తే కోపగించరా?" అన్నాడు.

అప్పుడు వారు "కృష్ణా! నీవుచేసిన వాగ్దానం మరచావా? శరదృతువు వచ్చిందికదా, రాసక్రీడ ఆడితేనే తప్ప మేము పోము" అని పట్టుపట్టారు.

అప్పుడు, వారిమాట కాదనలేక, కృష్ణుడు రాసక్రీడ ఆడి, గోపికలకు చెప్పలేని ఆనందం కలుగజేశాడు. ఈవిధంగా శ్రీ కృష్ణుని సాన్నిధ్యంపొంది గోపికలు తన్మయులైనారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st APRIL '80
6
CHANDAMAMA : STORY MAGAZINE FOR THE YOUNG

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
MAY '50
6
CHANDAMAMA
STORY MAGAZINE FOR THE YOUNG

అట్టమీది బొమ్మ

ఒక రోజున నారదమహర్షి కంసుని దర్బారుకు రాగా, ఆయనకు అర్ఘ్యపాద్యాదులిచ్చి పూజించి, "మహాత్మా! త్రిలోకసంచారులైన తమకు తెలియని విశేషాలు ఉండవుకదా! వినవలసిన సమాచారాలుంటే సెలవీయండి" అని కోరాడు, కంసుడు.

అందుకు నారదుడు "ఓయి మహారాజా! నీ కోటలో జరిగే అంతఃపుర రహస్యాలే నువు తెలుసుకోలేకున్నావు. ఎంత వెర్రివాడవు! ఇప్పుడు కొంప మునిగింది. నీ ప్రాణానికే మోసం వచ్చింది. ఆ సంగతి నీ చెవిని వేసి పోదామనే వచ్చాను" అనేసరికల్లా కంగారు పడుతూ కంసుడు అదేమిటో చెప్పవలసిందని ప్రాధేయపడ్డాడు.

అప్పుడు నారదమహర్షి ఈ రహస్యం వెల్లడించాడు. "ఓయి కంసా! దేవకీ వసుదేవులకు పుట్టినదని నీవు అనుకొన్న అష్టమ శిశువు యోగమాయ ఐ, నిన్ను హెచ్చరించి, అదృశ్యమైన సంగతి జ్ఞాపకమున్నదా? ఆమె నిజానికి గోకులంలో యశోదా నందులకు జన్మించింది. దేవకీ వసుదేవులకు ఎనిమిదవసారి శ్రీకృష్ణుడే పుట్టాడు. పుట్టిన వెంటనే శ్రీకృష్ణుడు యశోద వద్దకూ, యశోద పక్కలో వుండే స్త్రీశిశువు దేవకి వద్దకూ చేసుకోవటానికి పన్నాగం జరిగింది. దేవకి పక్కలో ఉండే ఆడశిశువును నీవు చంపబోతే అది యోగమాయగా మారి ఎగిరిపోయింది. బృందావనంలో నందుని ఇంట్లో కృష్ణుడూ, వాని అన్న బలరాముడూ పెరిగి పెద్దవారై నీ పరివారాన్నంతటినీ నాశనం చేస్తున్నారు. కనుక జాగర్తగా ఉండు" అని చెప్పాడు.

ఈ వార్త విన్నవెంటనే కంసుడు దేవకి వసుదేవులను దర్బారుకు రప్పించి వాళ్ళను చంపబోయేసరికి, నారదుడు అడ్డుపడి మందలించాడు. అప్పుడు కంసుడు కొంచెం తటపటాయించి, "సరే, ముందు వీళ్ళను ఖైదులో పెట్టండి" అని ఆజ్ఞాపించగా, భటులు దేవకీ వసుదేవులకు సంకెళ్ళువేసి తీసుకపోయారు.

చందమామ

పిల్లల కథల మాస పత్రిక

1st JUNE '50

6

అట్టమీది బొమ్మ

దేవకీ, వసుదేవులు చెరలో ఉన్నట్టు క్రిందటిసారి తెలుసుకొన్నాము. కంసుని కసి అంతటితో తీరలేదు. శ్రీకృష్ణ, బలరాముల భరతం పట్టిగాని నిద్రపోకూడదని నిశ్చయించి, ఈ పని 'కేశి' అనే రాక్షసునికి వప్పగించాడు.

కేశి అపరిమితమైన బలశాలి, అతి చురుకైనవాడు, పరమ దుర్మార్గుడు, పైగా భీకరమైన గుర్రం స్వరూపం కలవాడు. కంసమహారాజు అజ్ఞాపించిన వెంటనే వాడు ఉత్సాహభరితుడై, నందాదులు నివసించే బృందావనానికి దౌడు తీసుకొంటూ వచ్చాడు. చంద్రనిప్పులవంటి ఎర్రటి గుడ్లు మెరసిపోతూ, పొడవాటి జూలు అటు ఇటు ఊపుకొంటూ, టకటకమని అంగలు వేసుకొంటూ వచ్చే కేశి ధాటికి భూమి కంపించింది. ధూళిరేగింది. భయోత్పాతంతో అంతా ప్రాణాలు పిడికిట్లో పెట్టుకొనివున్నారు.

రాబోయే ఆపదను అవతారపురుషుడైన శ్రీ కృష్ణుడు గ్రహించి, నిమిషమైనా జాగుచేయక, ఒక్క ఊపున వెళ్ళి రాక్షసుని పైన తలపడ్డాడు. కేశి సామాన్యుడు కాడు. కృష్ణునిపైకి ఎగిరి తన్నబోయాడు.

అప్పుడు కృష్ణుడు, వాని వెనుకకాళ్ళు రెండూ పట్టుకుని గిరగిర తిప్పి దూరానికి ... ...తన కేశి మరింత పౌరుషంతో ... కృష్ణుని మోచేతిని కరిచిపట్టి,

... ...ష్ణుడు?— ఎడమచేతితో వాని ...తు ముడివరకు పోనిచ్చాడు. ... అంతకంతకు పెద్దదై, రాక్షసుని ... లేక కేశి నెత్తురు కక్కుకొంటూ ...పోయాడు.

చందమామ
పిల్లలకు కథల మాసపత్రిక
1st JULY '50

అట్టమీది బొమ్మ

అతి భయంకరమైన కేశినికూడ శ్రీకృష్ణుడు అవలీలగా చంపివేశాడని తెలియగానే కంసుడు తీవ్రాలోచనలో పడ్డాడు. కృష్ణబలరాముల పీడ వదిలించుకోవటం ఎలాగా అని అతని మనసు ఆరాటపడకొచ్చింది.

'ధనుర్యాగం' అనేటటువంటి మహా యజ్ఞానికి గొప్ప ఏర్పాట్లు చేయించాడు. ముష్టియుద్ధంలో ఖ్యాతిపొందిన వీరులను తయారుగా ఉంచాడు. 'కువలయ పీడనము' అనే భీకరమైన దుష్ట ఏనుగను సిద్ధపరిపించాడు. తనకు నమ్మిన బంటు ఐన అక్రూరుణ్ణి రప్పించి కృష్ణునిపై ప్రేమ చూపించి అతనితో 'తక్షణమే పోయి ఎలా ఐనా సరే కృష్ణ బలరాములను వెంటబెట్టుకు రావలిసింది. ఈ పని నెరవేర్చటానికి నీవే తగినవాడవు' అన్నాడు.

అక్రూరుడికి గట్టి చిక్కు వచ్చింది. అతను దయార్ద్ర హృదయుడు. ఒకరిని నొప్పించటానికి అతని మనసు ఎంతమాత్రము ఇష్టపడదు. పైగా అతను గాఢమైన కృష్ణభక్తుడు. అటువంటప్పుడు శ్రీకృష్ణుణ్ణి బంధించి దుష్టుడైన కంసుని చేతులలో వప్పజెప్పటం ఎలాగా ?—ఐతే యజమాని ఐన కంసునిమాట కాదనటానికా వీలులేదు. ఈ పరిస్థితిలో ఏమీ పాలుపోలేదు.

మరునాడు ఉదయానే కంసుడిచ్చిన రథంమీద అక్రూరుడు బయల్దేరి బృందావనమునకు సాగిపోయాడు. వెళుతూ దారిలో 'ఆ కృష్ణపరమాత్ముని దర్శన భాగ్యం నాకు కలగబోతూవుంటే విచారమెందుకు ? నా ధర్మం నేను నెరవేర్చుకుంటాను. నేను నిమిత్తమాత్రుణ్ణేకాని కృష్ణుణ్ణి నేను పట్టి ఇచ్చేవాడినా ? అవతారమూర్తి ఐన ఆ భగవానునికి ఈపాటి తెలియదా ?' అని ఇలా అనుకొంటూ పోయి నందుని ఇంటిముందు రథం నిలిపాడు. శ్రీకృష్ణ బలరాముల దర్శనం కావటంతోనే అక్రూరుడు పరవశుడై అతిభక్తితో అమాయిక హృదయంతో వారికి సాష్టాంగపడ్డాడు. ఇంతకాలానికి వచ్చిన తన ఆప్త మిత్రుణ్ణి శ్రీకృష్ణుడు అప్యాయంతో చేరదీసికొని కుశలప్రశ్నలు వేయగా అతను కంసుని కుటిలవర్తనమంతా భగవానునికి వెల్లడించాడు. ఏమీ ఎరుగనట్లు శ్రీకృష్ణుడు ఆ సంగతులన్నీ ఆసక్తితో వినేదంగా వినజొచ్చాడు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక

అట్టమీది బొమ్మ

కంసుని ఆజ్ఞ ప్రకారం అక్రూరుడు వెళ్ళి కృష్ణ, బలరాములను మధురా పుర పొలిమేరకు తీసుకవచ్చాడు. 'అక్రూరా!—మేము ఇక్కడనే వుంటాము. నీవు మీ రాజువద్దకు పోయి, మా రాకను గురించి చెప్పు' అంటూ, శ్రీకృష్ణుడు అతనిని పంపివేసి, అన్నతోసహా నగరం చూడబోయాడు. ధనుర్యాగంకోసం ప్రత్యేకించి చేయబడిన ఆ మధురాపట్టణపు అలంకారాలు, అందచందాలు కృష్ణ బలరాములను ఎంతో ఆకర్షించినై. వారు అలా వీధుల వెంబడి వెళుతూవుంటే, పురజనులు వారిని రెప్పవాల్పక చూడసాగారు.

కృష్ణ బలరాములు ఊరంట తిరుగుతూవుండగా దారిలో బట్టలమూట బుజాన వేసుకుని వస్తున్న ఒక చాకలివాడు తారసపడ్డాడు. వాడిని కుశల ప్రశ్నలు వేసేసరికి, 'నేను కంసమహారాజావారి చాకలిని' అన్నాడు. ఐతే మాకు కొన్నివస్తులు ఎరువియ్యి. మేము రాజుగారిని చూడబోతున్నాము. వారి దర్శనం చేసుకవచ్చి, బట్టలు మళ్ళీ నీకిచ్చివేస్తాము' అన్నారు వారు. చాకలి పెంకిబిగిలు బిగిలేసరికి, కృష్ణుడు ఆ దుర్మార్గుణ్ని ఒక్క దెబ్బతో హతమార్చి మూటలోని దుస్తులు ఇష్టమొచ్చినన్ని తీసుకుని, తక్కినవాటిని వీధులో పేదవాళ్లకు పంచిపెట్టాడు.

మరికొంచెం దూరం పోయేసరికల్లా ఒక అందమైన చిన్నది ఎదురైంది. కాని పాపం, ఆమెకు గూని ఉండటంవల్ల ముఖం దించుకొని విచారంగా వుంది. ఆమె వాలకం కనిపెట్టిన మాయల కృష్ణుడు 'నీ వెవరవు'? అని ఆమె నడిగాడు. "నేను కంసమహారాజుగారి అంతఃపురంలో పరిచారికను. రాణిగారికి గంధం పట్టుక వెళుతున్నాను" అంటూ, ముద్దుకొద్దీ కృష్ణుని ఒంటికి ఇంత గంధంతీసి పూసింది. కృష్ణునికి జాలికలిగి, తన చేతులతో ఆమె వీపు తాకేటప్పటికల్లా ఆ దాసీగాని గూని ఎక్కడి దక్కడనే మాయమైంది. ఆమె చెప్పలేని ఉత్సాహంతో తన జన్మ తరింపజేసిన శ్రీ కృష్ణ బలరాములను అతిధులుగా ఇంటికి తీసుకపోయింది.

ఈ విధంగా మధురానగరిలో సోదరులిద్దరూ అనేకమందిని తరింపజేస్తూ అందరి మధ్యనా అల్లారుముద్దుగా మెలగుతూ వచ్చారు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1ST SEP '50
6

అట్టమీది బొమ్మ

కృష్ణుడినీ, బలరాముణ్ణీ ఎలా ఐనా హతమార్చాలెనని కంసునికి తాపత్రయం పట్టుకున్నది. ఈ దీక్షతోనే, ధనుర్యాగం అనే మిషమీద వారిద్దరనూ మధురకు వెంటబెట్టుకరమ్మని అక్రూరుణ్ణి పంపిన సంగతి మీకు యిదివరకే తెలుసు.

వాళ్ళను రప్పించాడే కాని, తీరా కృష్ణ బలరాములు వచ్చారనేవార్త చెవిని పడేసరికల్లా అతనికి చెప్పరాని మనోవేదన పట్టుకొన్నది. ఏమిచేదామన్నా పాలు పోయిందికాదు. అందుచేత 'యాగంకోసం జరిగిన యేర్పాట్లన్నీ నేను చెప్పినట్టుగా ఉన్నాయో లేదో చూచిరావాలి' అనుకొని బయల్దేరి మతిలేనివానిలాగా పట్టణమంతటా తిరుగులాడసాగాడు.

కంసుని ఆజ్ఞప్రకారం 'కువలయపీడనం' అనే భయంకరమైన ఏనుగను సిద్ధంచేసి, కోటద్వారంవద్ద నిలబెట్టి వుంచాడు మావటీడు. ఇంతలో కృష్ణబలరాములు వినోదార్థమై కోటకు వచ్చారు. వారు రావటమే తడవుగా మావటివాడు ఆ యేనుగును వారిపైకి తోలబోయినాడు. 'వద్దు, వద్దు' అంటూ చిన్నారి కృష్ణుడు ఎంతగా మందలించినప్పటికీ ఆ మాట మావటివాని చెవికి ఎక్కలేదు.

అప్పుడు కృష్ణ బలరాములు, ఆ ఏనుగయొక్క కాళ్లు నాలుగూ స్తంభాలుగా చేసుకుని, దాగుడుమూతాలాట ఆరంభించారు. తన కాళ్ళకిందనే దాక్కున్న మాయలకృష్ణుడు ఏనుగకు అందినట్టే కనపడేవాడు, కాని దొరికేవాడు కాదు. అతనిని పట్టవలెననే ప్రయత్నంలో ఏనుగా మావటీడుకూడా అలిసిపోయారు.

చివరకు అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు, కావాలని తనంతట తనే ఏనుగు తొండంలో చిక్కుకొన్నాడు. ఇదంతా తన ప్రజ్ఞే అనుకొని కువలయపీడనము అతనిని తొండంతో పైకంటా ఎత్తి, నేలనువేసి కొట్టబోయింది. కాని, కృష్ణుడు తొండం గట్టిగా మెలిపెట్టి కుంభస్థలంమీద కూర్చుని, దాని దంతమే ఒకటి విరిచి అంకుశంగా ఉపయోగించి పొడవగా, యేనుగ పర్వతంలాగా నేలకూలి, పరమాత్మునిలో ఐక్యమైపోయింది! దాని జీవుడు పోయేటప్పుడు అది చేసిన ధ్వనికి మధురాపురి అంతా భూకంపం వచ్చినట్టుగా దద్దరిల్లిపోయింది. ఆ ఉదుటుకి 'ఇదేమిటా ఈ భీభత్సం!' అని కంసుని గుండె అదరజొచ్చింది !!


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1ST OCT, '50
6

అట్టమీది బొమ్మ

కువలయపీడనమనే యేనుగను సంహరించిన తరువాత కృష్ణ బలరాములు కోట ద్వారాలవద్ద నిలబడి వేడుకలు చూస్తూవున్నారు. నిండు దర్బారు కలకల్లాడుతూ వుండగా అల్లంత దూరాన కంసమహారాజు సింహాసనం అధిష్ఠించి వున్నాడు. మహారాజుకి ఎదురుగ్గా గొప్ప మల్లయుద్ధరంగం ఏర్పాటయింది. అతి వైభవంగా నిర్మించబడిన ఆ రంగమందు ముష్టికుడు, చాణూరుడు మొదలైనటువంటి ముష్టియుద్ధవీరులు తయారుగా వున్నారు. వీరి విద్యలుచూచి ఆనందించటానికని జనం కిట కిటలాడజొచ్చారు.

ముష్టికుడు ద్వారంవేపు తిరిగి వెటకారంగా "ఓయి కృష్ణా! బలరామా!!— మీరు చూపులకు పిన్నలేకాని, నిజంగా ఎంత గొప్పవాళ్ళోయ్. మీబలం ఎటువంటిదో మన కంసమహారాజావారు చూచి మెచ్చుకుంటారట. ఏది, రండి! మాతో ఒక్కసారి కుస్తీపట్టి మమ్మల్ని ఓడించండి" అంటూ కయ్యానికి కాలు దువ్వాడు.

కృష్ణ బలరాములు చూస్తే ముష్టికుని పిడికిట్లో యిమిడిపోతారన్నమాట. వానితో ఈ పసిపాపలు పోరాడటమా? ఎంత విడ్డూరం! ఇందులో ఏదో మాయ వున్నదని అందరూ భయపడ్డారు. కాని అది మహారాజావారి ఆజ్ఞ.

చాణూరునితో కృష్ణుడూ, ముష్టికునితో బలరాముడూ తలపడి అత్యద్భుతంగా పట్టుపట్టారు. కృష్ణ బలరాములు—నూటిచూసి ఒక దెబ్బ, ఒక గుమ్మీపోటు యిచ్చి గభీమని పల్టీ కొట్టించినప్పుడల్లా ముష్టిక చాణూరులు పర్వతాలలాగా నేలనుపడి 'అమ్మో!' అంటూవుండేవాళ్ళు. కొంతసేపు వినోదంగా పట్లు పట్టిన తరువాత బాలకృష్ణుడు చాణూరుని చేతులూ కాళ్ళూ కలిపి పట్టుకొని బంతి ఎగరవేసినట్టు ఆకాశంమీదికి విసిరాడు. వాడు అమాంతం భూమిమీద తాటిపండులాగ పడి, 'కృష్ణా! కృష్ణా!!' అంటూ ప్రాణాలు విడిచాడు. ముష్టికునికీ ఇదేగతి పట్టింది. తరువాత వరుసగా కూట, శల, తోసలకులనే యోధులుకూడా కృష్ణ బలరాముల చేతిలో మృతి పొందారు.

చందమామ
కథల మాసపత్రిక
1st NOV. '50
6

అట్టమీది బొమ్మ

రాజ్యంలోని రాక్షసవీరులందరూ కృష్ణ, బలరాముల చేతులలో చచ్చారు కదా! వాళ్ళు పాతే పోయిరి. మహాయోధులైనటువంటి మల్లయుద్ధ ప్రవీణులు కూడా వాళ్ళచేత చిత్తుచేయబడేసరికల్లా కంసుని క్రోధాగ్నికి మితిలేక పోయింది. అందులోనూ కృష్ణ బలరాముల దిగ్విజయానికి తన ప్రజలే తన కళ్ళెదట జేజేలు కొట్టట చూచి, ఆ పరాభవాన్ని కంసుడు ఎంతమాత్రమూ సహించలేక పోయాడు.

మల్లయుద్ధం చూడటానికని వచ్చిన లక్షలాది ప్రజపై అతను మండిపడ్డాడు. అగ్గి కురిపించాడు. దిగ్గున సింహాసనం నుండి లేచి, "మూర్ఖులారా!—ఎందుకల్లా పళ్ళికిలిస్తారు? ఆ కుర్ర వెధవల్ని చూచి ఏమిటా మెచ్చుకోవటం, మీ మొహం? ఉండండి, మీ తెగులణుస్తాను' అంటూ వెర్రెత్తినవానిలాగా రంకెలు వేస్తూ, భటులతో "చూస్తారేం, ఆ రెండు పిశాచాలనూ మన నగరు అవతలికి తరిమి వేయండి. వాళ్ళ చేష్టలను మెచ్చుకొనే వాళ్ళనందరినీ చావకొట్టి చెవులు మూయండి. వాళ్ళ కొంపలు నాశనంచేయండి. అన్నట్టు— ముందుపోయి, ఆ నందుణ్ణీ వాళ్ళనూ బంధించండి..." అంటూ ఇలాగ వాగజొచ్చాడు.

ఇక ఈ పిచ్చివాణ్ణి ఇలా వదిలితే లోకానికే ప్రమాదమని తలిచాడు, అవతారమూర్తియైన శ్రీకృష్ణుడు. క్షణమాత్రంలో ఒక్క మెరుపులా మెరిసి, సింహాసనం అధిష్ఠించివున్న కంసమహరాజు తలపై కిరీటం ఎగురగొట్టి, జుట్టుపట్టి కిందికంటా లాగి ఒక్క తన్ను తన్నాడు. దెబ్బతో 'అమ్మా!' అనే పిలుపు లేకుండా కంసుడు గిర గిర తిరిగి దొర్లుకొంటూ వచ్చి, నేలపై పడ్డాడు. పడటతోనే కంసునిలోనుండి ఒక చిత్రమైన వెలుగు వచ్చి కృష్ణపరమాత్మునిలో ఐక్యమై పోయింది. ఈ విధంగా లోకకంటకుడైన కంసుడు పూర్వకాలమందు పొందిన వరమును అనుసరించి దేవునితో దెబ్బలాడి స్వర్గలోకానికి పోగలిగాడు. రాక్షస రాజు మరణించగానే దేవతలు పుష్పవృష్టి కురిపించారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
DEC.
6

అట్టమీది బొమ్మ

లోకకంటకుడైన కంసుణ్ణి శ్రీకృష్ణుడు సంహరించినట్టు క్రిందటిసారి చెప్పాము. కంసుడు చనిపోగానే కంకన్యగ్రోధకుడు, క్రోధకుడు మొదలైన అతని ఎనమండుగురు తమ్ములూ కృష్ణబలరాముల మీదికి తలపడ్డారు. వాళ్లందరినీ బలరాముడు ఒక్కచేతిమీదుగా చీల్చి చెండాడి, హతమార్చివేశాడు.

అప్పుడు కంసుని భార్యలూ, అతని తమ్ముల భార్యలూ కృష్ణబలరాముల వద్దకు వచ్చి విలపింపసాగారు: "మహాత్ములారా! అవతారపురుషులైనటువంటి మీపైకి దండెత్తి రావడం ఎవళ్లకైనా తగునా? ఎంత అవివేకము! అందుకనే మా భర్తలు మీ చేతులలో మరణించారు. వారు అలా మరణించటం ఆశ్చర్యమేమున్నది?" అంటూ మనసు విడిచి వారు తమ ఆవేదన వెల్లడించేవరకు, కృష్ణబలరాములు వారిపైన జాలిచెంది వారి భర్తల ఉత్తరక్రియలను తామే స్వయంగా జరిపించారు.

తరువాత కృష్ణబలరాములు, చెరలో బంధింపబడివున్న తలిదండ్రులవద్దకు పోయి, దర్శనం చేసుకున్నారు. వారు కంటబడగానే దేవకీవసుదేవులు ముద్దుబిడ్డలను కౌగిట చేర్చుకుని "నాయనలూ! ఎన్నాళ్లకు చూడగలిగినాముురా మిమ్మలిని? కన్నులు కాయకాచిపోయినవే!" అంటూ అప్యాయత ఉట్టిపడేట్టు ముద్దులాడజొచ్చారు.

ప్రేమమూర్తులైన తలిదండ్రుల ఒడిలో ఇమిడిపోయినారు శ్రీకృష్ణబలరాములు: "జననీజనకులారా! ఆ కంసునికి వెరచి ఇంతకాలమూ మేము మీ ఎదుటకు రాలేకపోయాము. మిమ్మల్ని పరాధీనంలో ఉంచవలసివచ్చినందుకు ఎంతో పరితపిస్తున్నాము. మా తప్పు మన్నించండి" అని చెబుతూ, వారు క్రూర రాక్షసులెందరినో సంహరించిన వృత్తాంతాలన్నీ పూసగుచ్చినట్లు వివరించారు. ఆ చిత్రకథలన్నీ విని దేవకీవసుదేవులు ఆశ్చర్యపోయారు. కేవలమూ అవతారపురుషులైన కృష్ణబలరాములే తమకు పుత్రులుగా పుట్టినందుకు తమ జన్మ పావనమైపోయిందని పొంగిపోయి, వారు ఉత్సాహంతో ఆనందబాష్పాలు రాల్చారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1ST JAN. '51

తల్లిదండ్రులను దర్శించి, వారిని ఊరడించిన వెంటనే, శ్రీకృష్ణుడు తన తాత గారైన (కంసుని తండ్రి) ఉగ్రసేనుణ్ణి రాజ్యాభిషిక్తునిగా చేశాడు. ఇంతకుముందు కంసునికి భయపడి నానాదేశాలకూ చెదరిపోయిన స్వజనాన్ని మళ్లీ రప్పించి, సత్కరించి, వారికి కావలసినంత ధనమిచ్చి, వారు సుఖంగా ఉండేటందుకు తగు యేర్పాటులన్నీ చేశాడు. లోగడ కంసునివల్ల యమయాతనలు పడుతూ వచ్చిన యాదవులందరూ ఇప్పుడు శ్రీకృష్ణుని దర్శనంవల్ల కృతార్థులమయామని సంతోషించారు. తరువాత, కృష్ణుడు తనను పెంచి పెద్దచేసిన యశోదా నందనులను, గోపాలురతోసహా రేపల్లెవాడకు పంపించి, అక్కడ వారికి సమస్తమైన సౌఖ్యాలూ సమకూర్చాడు.

ఇక్కడ వసుదేవుడు తన ముద్దుబిడ్డలైన కృష్ణబలరాములకు గర్గునిచేత శాస్త్రోక్తవిధానంగా ఉపనయనాది సంస్కారాలు జరిపించాడు. వారు అయనవల్లనే గాయత్రి ఉపదేశంకూడా పొందారు. శ్రీకృష్ణ బలరాములు అన్ని విద్యలూ తెలిసిన సర్వజ్ఞులే ఐనప్పటికీ నరవేషం దాల్చివున్న అవతారమూర్తులు కాబట్టి, లోకంకోసమని గురుకులవాసం చేసి, విద్యాభ్యాసం చేయదలిచారు.

ఈ సంకల్పంతో కృష్ణబలరాములు కాశీపట్టణానికి పోయి, అవంతీపురంలో వుండే సాందీపనుడనే మహావిద్వాంసుణ్ణి ఆశ్రయించి, అయనకు శుశ్రూష చేయ నారంభించారు. ఈ శిష్యులసేవకు సాందీపనుడు చాలా సంతోషించి, సమస్త వేదములు, వేదాంగాలు, ధర్మశాస్త్రాలు మొదలైన విద్యలు బోధించాడు. విద్యలలో గల మర్మాలు, రాజనీతులలో ఉండే రహస్యాలు వెల్లడించాడు. అయన ఇంత శ్రద్ధగా చదువు చెప్పినందుకు శిష్యులున్నూ, ఒక్కతూరి విన్నంతమాత్రాన చక్కగా గ్రహించి, గురువు శ్రమను సారకం చేస్తూవచ్చారు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st FEB. '51
6
as

అట్టమీది బొమ్మ

ఒకరోజున బలరామ, కృష్ణులు సాందీపనునివద్దకు వెళ్లి, వినయపూర్వకంగా "గురువర్యా!—మాకు విద్యలన్నీ పూర్తి ఐనవని అంటిరికదా. ఇదంతా మీ కృపావిశేషంగాని వేరొకటి కాదు. అనుజ్ఞ ఇచ్చితిరంటే మేము మా తలిదండ్రులవద్దకు వెళ్లదలచి ఉన్నాము" అనేసరికి "తప్పక పోయిరండి: మీకు శుభమవుతుంది" అంటూ దీవించాడు గురువుగారు." "ఐతే, మహాత్మా!—మేము మా విధి నెరవేర్చుకోవద్దా? గురుదక్షిణ ఏమిటి సమర్పించుకోమంటారో సెలవియ్యండి, మీ కోరిక ఏదైనప్పటికీ నెరవేర్చటానికి సిద్ధంగా ఉన్నా" మన్నారు, బలరామ కృష్ణులు. అందుకు సాందీపనుడు ప్రియశిష్యుల అద్భుత మహిమకు మెచ్చుకొని ఈ సంగతి తన భార్యతో సంప్రతించాడు. ఆమెకూడా శిష్యుల సమర్థతకు సంతోషించి, "ఫలానా అప్పుడు ప్రభాసక్షేత్రంవద మన అబ్బాయి సముద్రంలో పడి చచ్చిపోయాడుకద! వాడు కంటబడితే చాలు, అంతకంటె మనకు కోరవలసిందేమున్నది" అన్నది. వెంటనే బలరామ కృష్ణులు రథంమీద ప్రభాస క్షేత్రానికి వెళ్లి అక్కడ దిగేసరికల్లా వీరి రాకను ఎరిగిన సాగరుడు పైకివచ్చి వారిని అనేకవిధాల పూజించి "మహాత్ములారా!—మీరు వచ్చిన కార్యము నాకు తెలుసు. మీ గురుపుత్రుణ్ణి శంఖ రూపం ధరించివుండే పంచజనుడనే రాక్షసుడు హరించివున్నాడు. నా అంతర్జలమందే వాని నివాసము" అని చెప్పాడు. వారు లోనికి చొచ్చి, పంచజనుని తెగటార్చారు. కాని, పిల్లవాడుమాత్రం కనపడలేదు. అప్పుడు వారు యమలోకం చేరుకొని పాంచజన్యమనే శంఖం పూరించగా, అది విని యమధర్మరాజు తటాలున ఎదురువచ్చి, వారిని పూజించి; వచ్చినపని యేమో సెలవీయమన్నాడు. వారు తమ కార్యమును వెల్లడించగా, తక్షణమే యముడు ఆత్మలోకంలో వుండే ఆ పిల్లవానిని తెచ్చి సమర్పించాడు. వానిని తీసుకువెళ్లి బలరామ కృష్ణులు గురువులకు దక్షిణకింద సమర్పించేసరికి సాందీపనుడూ, భార్యా అపరిమితానందభరితులై, వారిని వేవిధాల దీవించి, ఇంటికి పంపారు. ఈవిధంగా విద్యాభ్యాసం పూర్తిచేసుకొన్న బలరామ కృష్ణులు గురువుల ఋణం తీర్చుకొని, సంతోషంతో మధురాపురి చేరుకొన్నారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st MAR. '51
6

అట్టమీది బొమ్మ

★

శ్రీకృష్ణుడు కంసుణ్ణి సంహరించిన సంగతి తెలుసుకదా! కంసమహారాజు మరణించగానే అతని భార్యలు అస్తి, ప్రాప్తి పుట్టింటికి పోయి, తమకు పట్టిన దురవస్థనుగురించి తండ్రిఐన జరాసంధుడికి ఎరుకపరిచారు. జరాసంధుడు చాలా బలవంతుడు; పౌరుషవంతుడైన రాక్షసరాజున్నూ. కుమార్తెల గతి తెలియగానే అతడు రోషపూరితుడై, ఇరవైమూడు అక్షౌహిణీల సైన్యంతో మధురాపురంమీదికి దండెత్తి వెళ్ళాడు. ఈ ముట్టడి చూచి కృష్ణుడు వ్యాకుల చిత్తుడై, కర్తవ్యమేమిటా అని ఆలోచించాడు. 'ఇప్పుడు భూభారం చాలా హెచ్చుగా వున్నది. కాబట్టి ఈ ఇరవైమూడు అక్షౌహిణీల సైన్యాన్ని హత మార్చాలి' అని నిశ్చయించి, శంఖం పూరించాడు. కృష్ణ, జరాసంధుల మధ్యని భయంకర యుద్ధం జరిగింది. ఈ మహా యుద్ధానిక పధ్నాలుగు భువనాలూ గజగజలాడిపోయొచ్చినై. చచ్చినవాళ్లు చావగా, మిగిలినవాళ్లు పటాపంచలై జరాసంధుని సేన నామరూపాలు లేకుండా పోయింది. బలీయుడైన జరాసంధుడు ఈవిధంగా పదిహేడుమారులు దండెత్తి వెళ్లి అన్నిసార్లూకూడా కృష్ణునిచేతిలో ఓడిపోతూనే వచ్చాడు. ఇక పద్దెనిమిదోసారి మళ్లీ మధురాపురిపైకి ఎత్తివెళదామని అనుకొనేటంతలో, నారదమహర్షి ప్రేరణవల్ల యవనుడు తన మూడుకోట్ల మ్లేచ్ఛసేనలను కూర్చుకొని మధురను ముట్టడింపవచ్చాడు. 'అబ్బో! అటు జరాసంధుణ్ణీ ఇటు యవనుణ్ణీ ఒక్క సారిగా ఓడించటం కష్టసాధ్యమైన పని అవుతుందే. పోనీ అని ఊరుకుంటే నా యాదవులందరూ నిష్కారణంగా హతులైపోతారు' అని దూరం యోచించాడు శ్రీకృష్ణుడు. తక్షణమే విశ్వకర్మను పిలిపించి, 'మనకు ఇటువంటి గొప్ప విపత్తు వచ్చి ఉన్నది. కనుక నీవు ఈమట్టున సముద్రంమధ్యని ఒక దుర్గం నిర్మించవలసింది' అని అజ్ఞాపించగా, ఆ శిల్పి, కనుమూసి తెరచేటంతలో అనేకమైన హంగులతో దివ్యమైన జలదుర్గం నిర్మించాడు. శ్రీకృష్ణుడు సంతోషించి, ఆ నగరానికి 'ద్వారక' అని పేరుపెట్టి, యోగమాయా ప్రభావం వల్ల తనవారినందరినీ అక్కడ సురక్షితంగా ప్రవేశపెట్టాడు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st A
6
Acharya

అట్టపీది బొమ్మ

విదర్భదేశాన్ని పాలించే భీష్మకమహారాజు కూతురు రుక్మిణి. రుక్మిణిని శిశుపాలునికిచ్చి చేదామని ఆమె అన్న రుక్మి వుద్దేశం. శ్రీకృష్ణుని పెళ్లాడాలని రుక్మిణి ఆరాటం. రాజధానీ నగరమైన కుండినపురంలో పెళ్లి యేర్పాటులు చకచక సాగిపోతున్నై. మరి రుక్మిణి కోరిక నెరవేరేదెట్లా? రుక్మిణి చాలా తెలివైన పిల్ల కావటంచేత అగ్నిద్యోతనుడనే బ్రాహ్మడ్ని రహస్యంగా పిలిచి 'విప్రోత్తమా!—మీవలన నాకొక మహోపకారం జరగాలి. అదేమిటీ అంటే: ద్వారకలో ఉండే శ్రీకృష్ణునివద్దకు వెళ్లి నిన్నే పతిగా నిశ్చయించుకొనివున్న ఫలానా రుక్మిణి పంపించిందని నచ్చేవిధంగా చెప్పు. నా అన్న రుక్మి తలపెట్టిన వ్యూహం వెల్లడించు. ఒకవేళ శిశుపాలుడు ఎదురుతిరిగితే అతనితో యుద్ధం చేయటానికికూడా సిద్ధంలో ఉండాలను. ఇంతకూ నన్ను కలుసుకోవడమెట్లా అని శ్రీకృష్ణునికి సంశయం కలగవచ్చు. అదీ చెబుతా: పెళ్లికి తొలినాడు గౌరీ పూజకని ఊరిబయటి గుడిలోకివస్తాననీ, ఆ సమయంచూచి నన్ను ఎత్తుకపోయి రాక్షసవిధానాన వివాహమాడవలిసిందనీ ఉపాయం చెప్పు' అంటూ రాయబారం పంపింది. ఇక్కడ రుక్మిణి ఎలా ఆరాటపడుతున్నదో అలానే ద్వారకలో శ్రీకృష్ణుడు రుక్మిణినే పెళ్లాడాలని నిశ్చయించుకుని, ఎలా సాధ్యపడుతుందా అని తహతహపడుతున్నాడు. అందుచేత అగ్నిద్యోతనుడు వెళ్లి కబురు చెప్పగానే శ్రీకృష్ణుడు ఆనందభరితుడై బ్రాహ్మణ్ణి అనేకవిధాల సత్కరించాడు. ఆయన చెప్పినప్రకారం సైన్యం సిద్ధం చేశాడు. బ్రాహ్మణ్ణి తన రథంమిద తీసుకవచ్చి, కుండిన పొలిమేరలో వదిలేశాడు. ఈ రహస్య రాయబారం పంపినప్పటినించీ రుక్మిణి మనసులో ఎన్నో భావాలు పరుగిడజొచ్చినై. తననుగురించి కృష్ణుడు ఏమనుకుంటున్నాడో, ఏమి జరగబోతుందోననే వేదనకు అంతులేకపోయింది. ఇటువంటి సమయంలో ఆమెఎడమకన్ను అదరటంవల్ల శుభమే జరుగుతుందని రుక్మిణి ధైర్యపడింది. అంతలోనే తిరిగి వచ్చిన అగ్నిద్యోతనుని ముఖం చూడ కలకల్లాడుతూవుంది. దీన్నిబట్టే తన పని సానుకూలమైనట్టు ఆమె గ్రహించింది. బ్రాహ్మణుడు కృష్ణుని రాకనుగురించి నోటారా చెప్పేసరికి ఆమె ఆనందానికి మేర లేకపోయింది. ఈ సంతోషంతో రుక్మిణి సుముహూర్తమందే గుడికి పోయి, పూజలు పూర్తిచేసుకొని, నిశ్చింతగా ఇంటికి మరలి వస్తున్నది.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st MAY '51

అట్టమీది బొమ్మ

★

ఊరివెలుపలి గుడినుండి రుక్మిణి తిరుగ వచ్చేటప్పుడు శ్రీకృష్ణుడు బలాత్కారంగా తన చెల్లెలిని ఎత్తుకపోయి రాక్షసవిధానంగా పెళ్లాడబోతున్నట్టు రుక్మికి తెలియవచ్చింది. ఈ వార్తకు అతను మండిపడ్డాడు. 'కృష్ణుణ్ణి చంపి, చెల్లిని విడిపించిగాని కుండినకు మరలిరాను' అని ప్రతిజ్ఞ చేశాడు. ఆవెంటనే ఒక అక్షౌహిణి సైన్యం సిద్ధం చేశాడు. సారథితో 'మన రథాన్ని దుర్బుద్ధి ఐన ఆ గోపాలుడివద్దకు పోనీయవోయ్. నాలుగు బాణపు దెబ్బలతో వాడి గర్వం అణచి పారవేస్తాను' అన్నాడు. రుక్మి కృష్ణులమధ్యని పౌరుషం రేగింది. యుద్ధం జరిగింది. కృష్ణుడు రుక్మిని సంహరించబోతూవుండగా రుక్మిణి ఆయన పాదాలు పట్టుకొని 'దేవదేవా! జగత్పతీ!! ఈ ఒక్కసారికీ నా అన్నను క్షమించి వదిలివెయ్యి' అంటూ దీనంగా ప్రార్థించింది. అప్పుడు శ్రీకృష్ణుడు రుక్మిని కట్టివేసి, నేలకు పడకొట్టి, కేశాలూ, మీసాలూ కత్తిరించి, అతనిని కురూపిగా తయారుచేశాడు. అంతట బలరాముడు వచ్చి, "తమ్ముడూ! యేమిటి యిటువంటి పని చేశావు? అతడెటువంటివాడైనా మన రుక్మిణికి అన్నేకదా! అయిందేదో అయింది. పురుషుడికి మీసాలు తీసివేయటంకంటె మించిన శిరచ్ఛేదం లేదు. కనుక, ఇంతటితో వానిని వదిలేయవలిసింది' అంటూ మందలించాడు. అందుకు కృష్ణుడు "అన్నయ్యా!—నేను చేసింది ఏమీ లేదు. వాడి కర్మే వాడిని ఇలా చేసింది' అని చెబుతూ, జీవిత పరమార్థం వెల్లడించాడు. ఇప్పుడు—ఈవిధంగా పరాభవం పొందిన రుక్మి ప్రాణాలతో బయటకు వచ్చేశాడు. మరి, కృష్ణుణ్ణి చంపి, చెల్లెలిని విడిపించిగాని కుండినకు మరలనని శపథం చేసివున్నాడుగా! అందుకని, అక్కడికి పోవటానికి మొహం చెల్లక, భోజకటం అనే వూరు చేరుకుని, తలదాచుకొనబోయాడు.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

★

దుష్టసంకల్పంతోవున్న రుక్మిని కృష్ణభగవానుడు పరాభవించిన సంగతి కిందటిసారి తెలుసుకున్నాం. ఆతరువాత రుక్మిణికీ, శ్రీకృష్ణునికీ శాస్త్రోక్తంగా వివాహం జరిగింది. తదుపరి కృష్ణుడు సంచారం బయల్దేరాడు. వెళ్లినచోటల్లా ఆయా రాజులు తమ తమ కుమార్తెలను పెళ్లాడుమని శ్రీకృష్ణుని బలవంత పెట్టసాగారు. వారిని కాదనలేక, ఆ రాజకుమార్తెలను కృష్ణుడు స్వీకరిస్తూ వచ్చాడు. అతను చేపట్టినవారిలో సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ—ఇలా ఎంతోమంది ఉన్నారు. ఈ అందరిలో నాగ్నజితి ఉదంతం చాలా చిత్రమైనది. ఈమె కోసలమహారాజైన నగ్నజితు కూతురు. అయన వరునికి ఒక పరీక్ష పెట్టాడు. తనవద్దనున్న భయంకరమైన ఏడు వృషభాలను ఎవడైతే లొంగదీయగలడో, అటువంటి వీరుడికి తన కూతురును ఇస్తానని ప్రకటించాడు. ఎందరెందరో శూరులూ, వీరులూ వచ్చారు. వృషభాలను చూచేసరికల్లా, తారెత్తి వారందరూ తోక ముడిచారు.

కొంతకాలానికి, సంచారంచేస్తూవున్న శ్రీకృష్ణుడు ఈ కోసలరాజ్యానికి రావడం తటస్థించింది. నగ్నజితు అతనిని ఎంతో అప్యాయంతో ఆదరించాడు. కృష్ణుణ్ణి చూసి అతడే తనకు పతి కావాలని నాగ్నజితి వాంఛించింది. అన్నట్టుగానే కోసలరాజు తన షరతును కృష్ణునికి తెలియజెప్పగా, కృష్ణుడు పరీక్షకు అంగీకరించాడు. భయంకరమైన ఆ వృషభాల ఎదుటికి వెళ్లేసరికల్లా అవి తోకలెత్తిపెట్టి, తమ వాడి కొమ్ములతో కృష్ణుడ్ని వాయువేగాన తరుముకు వచ్చినై. అప్పుడు కృష్ణభగవానుడు ఆ ఏడు వృషభాలకూ, ఏడు రూపులుగా ప్రత్యక్షమై, ఒక్కొక్కదానిని ఒక్కొక్క లిప్తలో లొంగదీసి, ముక్కుతాళ్లువేసి బంధించివేశాడు. కోసలరాజు ఆనందానికి మేరలేకపోయింది. తన తపము ఫలించినందుకు నాగ్నజితి ఉవ్విళ్లూరింది. కోసలరాజు అల్లుడికి గొప్పగొప్ప అరణాలిచ్చి అతి వైభవంగా పెళ్లిచేసి, అపురూపమైన అందాల రథంమీద అల్లుడినీ కూతురినీ ద్వారకకు సాగనంపాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st JULY '51
6

అట్టమీది బొమ్మ

నరకుడు గొప్ప రాక్షసుడు. ఒకప్పుడు వాడు వరుణుని ఛత్రమూ, అదితి కుండలాలూ, మేరువులో ఉండే మణిపర్వతమూ—వీటిని హరించివేశాడు. దీనివల్ల లోకానికి చాలా బాధ కలిగింది. ఈ సంగతి మహేంద్రుడు పోయి కృష్ణుని చెవిని వేశాడు. నరకుణ్ణి సంహరించడానికని కృష్ణుడు సంసిద్ధుడైనాడు. ఇది విని నరకుడు మురుడనేవాడిని పురికొల్పాడు.

మురుడు ప్రాగ్జ్యోతిషపురానికి అధిపతి. వాడు ఐదుతలలు గల భయంకరుడు. జలస్తంభన విద్యలో ప్రవీణుడు. నీటిలో ఉండగా ఎవ్వరూ వాడిని జయించలేరు. అందుచేత శ్రీకృష్ణభగవానుడు గరుడవాహనం ఎక్కి, ఆకాశమార్గాన వచ్చి, ఒక్క బాణం వేసేసరికి మురుడు నిద్రనించి మేలుకొని నీటనుండి పైకి లేచి, త్రిశూలం చేతపట్టుకొని భీకరాకారంతో భూనభోంతరాళాలు దద్దరిల్లేటట్టు బొబ్బలుపెడుతూ వచ్చాడు. మహాఉగ్రుడై మురుడు తన త్రిశూలం గురిపెట్టి, గరుడునిపై తిప్పి కొట్టాడు. కృష్ణుడు ఆ త్రిశూలాన్ని ఒక్కబాణంతో ముక్కముక్కలు చేసివేశాడు. వెంటనే మురుడు అలిగి, కృష్ణునిపైన గద ఎత్తి విసిరాడు. కృష్ణుడు మళ్లీ గద వానిపైన విసిరి దెబ్బకు దెబ్బ తీశాడు. చేసేదిలేక మురుడు కృష్ణునిమీదికి ఎగసి రాబోయాడు. ఇది పనికాదని శ్రీకృష్ణుడు చక్రాయుధం ప్రయోగించేసరికి మురుడు ఒక పెద్ద పర్వతానికిమల్లే నీటిలో కూలబడి ప్రాణం విడిచాడు.

మురుడు కూలిపోగానే వాని ఏడుగురు కొడుకులు—తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావసుడు, వసుడు, నభస్వంతుడు, అరుణుడు అనే వాళ్లు పీఠుని సేనాధిపత్యం కింద రకరకాల ఆయుధాలూ అస్త్రాలూ చేతపట్టి కృష్ణుణ్ణి ఎదుర్కొన్నారు. యోధానయోధులను తెగటార్చిన కృష్ణునికి వీళ్లొక లెక్కా! వాళ్లుతెచ్చిన సాధనాలన్నిటినీ అవలీలగా ఖండించివేసి, ఒక్క తృటిలో వాళ్లందరనూ యమపురికి పంపించివేశాడు అవతారపురుషుడైన శ్రీకృష్ణుడు. ఈవైనం తెలిసి నరకుడు కృష్ణునిపైన పగ పట్టాడు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st AUG.
6

అట్టమీది బొమ్మ

బావమరిది ఐన శ్రీకృష్ణునిచేత రుక్మి పరాభవింపబడిన సంగతి ఇదివరకు చదివే ఉన్నారు. ఇందువల్ల రుక్మికీ కృష్ణునకీ మధ్య బద్ధవైరం కలిగింది. కలగవచ్చు. కాని, రుక్మికి చెల్లెలైనటువంటి రుక్మిణిపైన ఉండే ప్రేమాభిమానాలు ఎక్కడికి పోతై? రుక్మికి రుక్మవతి అనే కూతురు, రుక్మిణికి ప్రద్యుమ్నుడు అనే కుమారుడు. ఉభయులకూ పెళ్లి అయింది. వారికి అనిరుద్ధుడనేవాడు పుట్టాడు.

అనిరుద్ధుడికి యుక్తవయస్సు రాగా రోచన అనే కన్యనిచ్చి వివాహం చేయటానికి అతివైభవమైన యేర్పాట్లు జరిగినై. కాళింగాది రాజులందరూ పెళ్లికి విచ్చేశారు. పెళ్లి సందడిలో పిన్నలందరూ వేడుకలందు మునిగి, సంతోషంతో మెలగుతున్నారు. పెద్దలుకూడా వారివారికి తగిన సరదాలు తీర్చుకొంటున్నారు.

ఈ సందర్భంలో 'బలరామునితో జూదం ఆడి గెలుచుకోగలవా?' అంటూ రుక్మిని హుషారు చేశారు కాళింగాది రాజులు. అతనికి ఆట తెలియకపోయినా 'సరే'నంటూ తయారయ్యాడు. మొదట వేసిన నూరు, వెయ్యి, పదివేలు పందెములు రుక్మే గెలుచుకున్నాడు. ఇది చూచి కాళింగుడు పకపక నవ్వి బలరాముణ్ణి పరిహసించాడు. బలరాముడు మండిపోయాడు. తరవాత పందెములో బలరాముడు లక్ష మాడలు గెలిచాడు. ఐనా, "నేనే గెలిచా'నంటూ రుక్మి బూకరించాడు. బలరాముడు క్రోధపూరితుడైనాడు. తరువాతి పందెములో బలరాముడు పదికోట్లు గెలిచాడు. ఐనా, 'నేనే గెలిచా'నని రుక్మి మళ్లీ డబాయించాడు. పైగా, 'కావాలంటే ఇక్కడి పెద్దల నడగవయ్యా!' అన్నాడు.

అంతలో "బలరాముడే గెలిచాడు. రుక్మిమాట బొంకు!" అని ఆకాశవాణి స్పష్టంగా పలికింది. ఐనా, రుక్మి లెక్కచేయలేదు. 'అయ్యా! మీరు అడవులు తిరిగే గోపాలురు కాని అక్షవిద్యలో ప్రవీణులు కారు' అని బలదేవుని వేళాకోళం చేశాడు. కూడాఉన్న రాజులున్నూ ఈ మాటకు తాళం వేశారు.

అప్పుడు బలరాముడు ఉగ్రనరసింహమూర్తియై, ఒక్కదెబ్బకు లాఠితో రుక్మిని చంపివేసి, పారిపోతున్న కాళింగుణ్ణి పది అడుగులలో పట్టుకుని, ఏపళ్లు బైటపెట్టి తనను పరిహసించాడో, ఆ పళ్లు పటపట విరిగేటట్టు రాలగొట్టాడు. మిగిలిన రాజులు బలరాముని ధాకకు ఆగలేక కాలికొద్దీ పరుగుచ్చుకున్నారు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st SEP. '51
6
E.SAVA

అట్టమీది బొమ్మ

పౌండ్రకవాసుదేవుడనే రాజు కరూశదేశాన్ని ఏలుతూ ఉండేవాడు. అవతార పురుషుడైన శ్రీకృష్ణునికికూడా అనేక నామాలతోపాటు వాసుదేవుడనే పేరున్నది. ఈ సంగతి తెలిసి, పౌండ్రకుడు అసూయ చెందాడు. మూర్ఖతకొద్దీ కృష్ణునిపైన కార్పణ్యం వహించాడు.

ఉండబట్టలేక ఒకరోజున అతడు దూతలలో ఒకనిని చేరబిలిచి, "ఎవడో కృష్ణుడట! గొల్లపిల్లవాడట! వాసుదేవుడనే నా పేరు పెట్టుకుని తిరుగుతున్నాడట!! వాసుదేవుడనే బిరుదు నాకే తగును కాని, మరెవళ్లకు అర్హత ఉన్నది? కనుక, ఇప్పుడే నీవు ఆ కృష్ణునివద్దకు వెళ్లి నేను అన్నట్టుగా ఇలా చెప్పు: 'అబ్బాయీ! జాతిమర్యాదలు విడిచి, నీవు నాపేరు పెట్టుకు బతుకుతున్నావట, ఇది నీకు తగదు. తెలిసో తెలియకో చిన్నతనంచేత ఈ పని చేసిఉంటావు. ఇప్పుడైనా బుద్ధి తెచ్చుకొని, నీవు ధరించిన నా రాజచిహ్నాలు త్యజించు. ఆ శంఖచక్రాలూ అవ్వీ తీసివేసి నా శరణు చొచ్చితివంటే నేను నిన్ను క్షమిస్తాను' అని చెప్పిరా, పో" అంటూ వేగిరపెట్టాడు.

దూత సరాసరి వెళ్లి, నిండు సభలో ఉన్న శ్రీకృష్ణునికి ఈ వర్తమానం చెప్పాడు. అతడు చెప్పిన మాటలకు కృష్ణుడు పకపక నవ్వాడు. సభలోనివారం దరూ ఆశ్చర్యపోయారు. అంతట శ్రీకృష్ణుడు దూతను అనేకవిధాల సత్కరించి, "ఓయీ!—నేను త్వరలోనే వస్తున్నానని మీ యజమానికి తెలియజెయ్యి. యుద్ధ రంగమందు అతని శరీరము కుక్కలకు, నక్కలకు, గెద్దలకూ ఎర ఐనప్పుడు నేను ఈ 'వాసుదేవు'డనే బిరుదు విడుస్తానన్నానని చెప్పు" అన్నాడు.

ఈ మాటలకు దూత హడిలి పారిపోయి, పౌండ్రకునితో విన్నవించాడు. వెంటనే పౌరుషంతో పౌండ్రకుడు అచ్చగా కృష్ణునిలా కనుపించేట్టు వేషం వేసుకొన్నాడు. రెండు అక్షౌహిణుల సైన్యం సిద్ధం చేశాడు. మరి మూడు అక్షౌహిణుల సైన్యంతో అతని స్నేహితుడైన కాశిరాజు తోడు వచ్చాడు. వాసుదేవుడికీ, పౌండ్రకవాసుదేవుడికీ మధ్య ఘోరయుద్ధం జరిగింది. హోరాహోరీగా పోరిన తరువాత, కృష్ణుని చేతిలో పౌండ్రకుడు హతుడయ్యాడు. వాని సహకారి ఐన కాశిరాజును బాణంతో కొట్టేసరికి, వాని పుచ్చె ఎగిరి, తిన్నగా వెళ్లి కాశీపట్టణం లోనే వాని స్వంత కోట ఎదట పడింది!!

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



అట్టమీది బొమ్మ

నరకుడనే రాక్షసరాజు కృష్ణునిపైన పగబట్టిన సంగతి లోగడ తెలుసుకొనే వున్నారు. వాడు పగ సాధింపబోయి, చివరకు శ్రీకృష్ణుని చేతిలో హతుడయ్యాడు. నరకుడు చనిపోగానే, వానికి ప్రాణస్నేహితుడూ, సుగ్రీవుని మంత్రి ఐన ద్వివిదుడనే వానరునికి ఉద్రేకం పుట్టుకొచ్చింది. కృష్ణ బలరాములను పరిమార్చి నరకుని ఋణం తీర్చుకోవాలని వాడు కృతనిశ్చయుడైనాడు. ఈ దుష్టసంకల్పం ఎప్పుడైతే కలిగిందో ఆ క్షణమందే బలగాన్ని వెంటబెట్టుకుపోయి ఉపద్రవకరమైన చేష్టలతో దేశం నాశంచేయటానికి పూనుకొన్నాడు. ఆ రాక్షసబలగం పట్టణాలమీదా గ్రామాలమీదా పడ్డారు. చిచ్చుపెట్టారు. కొండలు తెచ్చి విసిరారు. సముద్రాలలో నీరు ఎగజిమ్మి దేశాలు ముంచివేశారు. మహర్షుల ఆశ్రమాలలో యజ్ఞవేదికలు మైలపరిచి, హోమగుండాలు చల్లార్చరు. స్త్రీలను గుహలలో పెట్టి బంధించారు. నిందించారు.

ఇలా ఉండగా ఒకరోజున ద్వివిదుడికి రైవతపర్వతం వైపునించి కమ్మటి సంగీతం వినిపించింది. ఏమిటా చూదామని అక్కడికి వెళ్లేసరికి, ప్రియురాండ్ర మధ్యని సంగీతం పాడుతూవున్న బలదేవుడు అగుపించాడు. ద్వివిదుడు ఒక చెట్టెక్కి కూర్చుని, కొమ్మలు వూపుతూ కిలకిలా నవ్వాడు. బలరాముని ప్రియురాండ్రు వానిని ఎగతాళి చేశారు. వాడు, బలరాముడికి కనపడేట్టుగా వాళ్లను వెక్కిరించి కనుబొమ్మలాడించాడు. కొంటెపను లెన్నో చేశాడు.

బలరాముడు అలిగి పెద్ద బండ విసిరాడు. వానరుడు తప్పించుకుని బలరాముని మధుకలశం పగలగొట్టాడు. పైగా ఆడవాళ్ల చీరెలు చించివేశాడు. బలరాముడు ఉగ్రుడై, హలమూ ముసలమూ చేతపుచ్చుకొని యుద్ధానికి తలపడ్డాడు. ఇదిచూచి వానరుడు పెద్ద చెట్టొకటి పెకలించి ఒక్కపరుగున వచ్చి బలదేవునిపైన విసిరాడు. బలరాముడు దాన్ని తప్పించుకొని ముసలం విసరగా, అది వాని తలకు కొట్టుకొని మెదడు చెడిపోయింది. దెబ్బతో నెత్తురు వరదలు ప్రవహించినై. తరువాత ఉభయుల మధ్యనా వృక్షాలతోను, శిలలతోను తీవ్రమైన సంఘర్షణ జరిగింది. చివరకు వానరుడు రెండు పిడికిళ్లూ బిగించి బలరాముని రొమ్ముమీద గ్రుద్దేసరికి, ఆయన రోషపూరితుడై, నెత్తురు కక్కుకొనేలాగ ద్వివిదుని గొంతుపిసికి చంపి, లోకానికి వాడి పీడ వదిలించాడు.

Controlling Editor : SRI CHAKRAPANI
Printed and Published by B. NAGI REDDI, at the B. N. K. Press, Madras - 1


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st NOV. '51
6

అట్టమీది బొమ్మ

దుష్టరాక్షసుడైన నరకుణ్ణి హతమార్చివేశాడుకద శ్రీకృష్ణుడు. ఆ తరవాత పరమాత్ముడు పదహారువేలమంది గోపికలను ఒక్కసారిగా పెళ్లాడినాడట!— ఎంత వింత!! ఎటువంటి విడ్డూరం!!! ఈ వార్త చెవినిపడగానే, చిత్రమేమిటో చూచివద్దామని త్రిలోకసంచారి ఐన నారదమహర్షికి కుతూహలం కలిగింది. వెంటనే ఆయన బయల్దేరి వెళ్లి అతివైభవంతో ప్రకాశిస్తూవుండే ద్వారకాపురి చేరుకొన్నాడు. సంతోషాంతరంగులైవున్న రుక్మిణీ కృష్ణులను సందర్శించాడు.

కృష్ణుడు ఠగ్గునలేచి, మహర్షికి అర్ఘ్యపాద్యాదులిచ్చి సత్కరించాడు. కుశలప్రశ్నలైనతరువాత నారదుడు 'ఓ సర్వలోకనాయకా! లోకక్షేమంకోసమని నీవు అవతారమెత్తుతావన్న సంగతి నాకు ముందే తెలుసు. సంసార కూపంలో పడిపోయినవారికి పట్టుకొమ్మవై ముక్తినిచ్చే నీ పాదయుగమే నాకు లభించింది. ఇంతకంటె ఏం కావాలె!' అని స్తుతించి, సెలవు తీసుకుని ఒక గోపిక యింటికి వెళ్లాడు. అక్కడ గోపికతో ముచ్చటిస్తూ, తాంబూలచర్వణం చేస్తూవున్న కృష్ణుడు లేచివచ్చి మహర్షికి అర్ఘ్యపాద్యాదులిచ్చాడు.

నారదుడు అమితాశ్చర్యం పొందాడు. తనివితీరక, పెడివడిగ గోపికల గృహాలు ఇంకా చూడాలనుకున్నాడు. ఒక గోపిక యింట్లో గానలోలుడైన మురళీకృష్ణుడు దర్శనమిచ్చాడు మహర్షికి. మరొక ఇంట్లో బిడ్డలనెత్తుకుని ముద్దాడుతున్న ప్రేమమూర్తి కృష్ణుడు అగుపించాడు. ఇంకొక గృహానికి పోగా ఉద్ధవునితో పాచికలాడుతూ క్రీడాసక్తుడైన శ్రీకృష్ణుడు కనబడ్డాడు. మరొకచోట తీర్పులు తీర్చుస్తున్న న్యాయాధిపతీ కృష్ణుని సందర్శనం లభించింది. ఇంకొక యింటిలో బ్రాహ్మణోత్తములకు మృష్టాన్నములు వడ్డిస్తున్న లీలామానుష విగ్రహుడైన కృష్ణుడు అగుపించాడు.

ఏకకాలమందే ఇన్నిరూపులతో ప్రత్యక్షమైన ఆ పరమాత్మునికి నమస్కరించి, "దేవాదిదేవా!—నీ యోగమాయావిలాసాన్ని కనుక్కోవటం ఎవళ్లతరమూ కాదు. నీ పాదపరిచర్యా మహిమవల్ల నేనొక్కడినే తెలుసుకో గలిగాను. పరమపావనమైన ఈ నీ లీలలు పాడుకొంటూ లోకాలు సంచరించుకపోతాను. అనుజ్ఞ ఇవ్వు" అంటూ, గోవిందుని సెలవు తీసికొని ఆనందంతో మరలిపోయాడు నారదుడు.



చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st DEC. '51
6
M.T.V. Acharya

అట్టమీది బొమ్మ

ధర్మరాజు రాజసూయయాగం తలపెట్టాడు. అందుకోసం భీమార్జునులు సంచారం బయల్దేరారు. భీమార్జునులతోకూడా శ్రీకృష్ణుడు మగధరాజధానికి బయల్దేరి వెళ్లి, జరాసంధునితో 'రాజేంద్రా!—మేము దూరదేశమునుండి వచ్చిన అతిథులము. నీవు అతిథిపూజాధురంధరుడవని విన్నాము, మేము కోరినది ఇచ్చి నీ బిరుదు సార్థకంచేసుకోవలిసింది' అన్నాడు.

'కోరుకోండయ్యా, మీకు కావలసినది. సంశయించకండి' అని జరాసంధుడు అనగానే వాసుదేవుడు మగధపతితో 'ఇతడు అర్జునుడు. అతడు భీమసేనుడు. ఇద్దరిలో ఎవరితోనైనాసరే యుద్ధంచేసి జయించాలి. ఇదే మా కోరిక' అన్నాడు. అందుకు జరాసంధుడు 'నీవు మధురనుంచి పారిపోయి సముద్రంలో దాక్కొన్న పిరికిపందవు. అర్జునుడు నాకంటె పిన్నవాడు, బలంలో నాకు తక్కువవాడున్ను. కనుక, సమానబలుడైన భీమునితోనే యుద్ధంచేస్తా' నన్నాడు.

ఇలా అంటూ జరాసంధుడు ఒక గద భీమునికి ఇచ్చాడు, రెండవది తను తీసుకున్నాడు. నగరు వెలపల రణరంగమందు ఇద్దరూ తలపడ్డారు. ఆ గడలు తిప్పుతూవుంటే చూచేవాళ్లకు కన్నులు గిరగిర తిరుగసాగినై. వారు డీకొంటూ వుంటే పిడుగులు పడ్డట్టు, బ్రహ్మాండమైన ఏనుగులు తొక్కినట్టూ చటచటా శబ్దాలు ఎగసినై.

కొంతసేపు గదాయుద్ధం అయినతరువాత ఆ మహావీరులు ముష్టిప్రహారాలు ప్రారంభించారు. ఒకళ్లనొకళ్లు పిడికిటిపోట్లు పొడుచుకొనటం చూడగా అతి భయంకరంగా తోచింది. ఒకరికొకరు తీసిపోకుండా పోరుసల్పటం చూచి, జరాసంధుని పుట్టుపూర్వోత్తరాలు తెలిసిన శ్రీకృష్ణుడు ఒక పుల్లతీసి, దానిని నిలువునా రెండు చీలికలుచేసి చూపుతూ భీమునికి సంజ్ఞచేశాడు.

ఈసంజ్ఞను భీమసేనుడు అందుకొని వెంటనే శత్రువును నేలకు పడగొట్టి వాని కాలు తనకాలితో తొక్కి, కాళ్లకు కాళ్లు చేతులకు చేతులు దేనికది చీల్చివేశాడు. దుష్టుడైన జరాసంధుడు ఇలా హతుడు కావటంతో జనులు హాహాకారాలొనరించారు, కృష్ణార్జునులు భీమసేనుని కౌగిలించుకొని, అనేకవిధాల మెచ్చుకొన్నారు.

1st JAN. '52
6
as
M.T.V Acharya

అట్టమీది బొమ్మ

రాజసూయయాగం ప్రారంభంకాబోతున్నది. ధర్మరాజు సదస్యుల అభిప్రాయం తెలుసుకొన్నాడు. వారి యిష్టప్రకారం మొట్టమొదట గోవిందుని పూజించాలెనని సంకల్పించి, ఆ మహాత్ముని సన్నిధికి వెళ్ళి పాదాలు కడిగాడు. పవిత్రమైన ఆ పాదోదకాన్ని తనూ, తమ్ములూ, కుటుంబమూ, పరివారమూ అందరూ శిరసున చల్లుకొన్నారు.

ధర్మరాజే ఇలా శ్రీ కృష్ణునికి పట్టువస్త్రాలూ దివ్యభూషణాలూ అర్పించి పూజించి ఆనందబాష్పాలు రాల్చేటప్పటికి, మహోత్సవం చూడవచ్చిన రాజులందరూ కృష్ణునికి భక్తితో ప్రణమిల్లి, జయజయశబ్దాలు చేశారు. పుష్పవర్షం కురిసింది.

ఇంతవేడుకగా శ్రీకృష్ణుడు తొలిపూజలు అందుకోవటాన్ని శిశుపాలుడు సహించలేక పోయాడు. కూర్చున్నవాడు కుపితుడై దిగ్గునలేచి, వాసుదేవుని నిందిస్తూ నోటికిరాని కారుకూతలు కూశాడు. కాని, కేశవుడు కిమ్మనలేదు. అటుతరువాత శిశుపాలుడు సదస్యులవంక తిరిగి 'తపోధనులు, బ్రహ్మనిష్ఠులు ఐన ఋషివర్యులుండగా, ఎట్టి అర్హతలేని కుర్రవాడు ఈ గోపాలుణ్ని పూజిస్తూన్నారేమిటి?' అంటూ ఇష్టంవచ్చినట్టల్లా దుర్భాషలాడ నారంభించాడు.

హరినింద వినలేక సభాసదులు చెవులుమూసుకొని శిశుపాలుని తిడుతూ లేచిపోయారు. పాండుసుతులూ, మరికొందరు రాజులూ వానిని పరిమార్చటానికని తలపడ్డారు. అయితే, శిశుపాలుడు చలించలేదు. అందరినీ అదలిస్తూ తత్తరపడక అలానే నిలిచివున్నాడు.

అంతలోనే కృష్ణుడు ప్రయోగించిన సుదర్శనచక్రం తిన్నగా వెళ్ళి శిశుపాలుని తలనూ మొండెమునూ వేరుచేసింది. అప్పుడు శిశుపాలునిలోనుండి ఒక దివ్య తేజస్సు వెలువడి, మెరుస్తూపోయి కృష్ణభగవానునిలో ఐక్యమైపోయింది.

చందమామ

పిల్లల కథల మాసపత్రిక



1st FEB. '52

6 as.

అట్టమీది బొమ్మ

శిశుపాలుని చెలికాడు సాల్వుడు. శ్రీకృష్ణునికీ రుక్మిణికీ పరిణయం ఐననాటి నుండీ సాల్వుడికి కృష్ణునిమీద కోపంగానే వున్నది. 'కృష్ణుడినేకాదు, యాదవ కులమే నిర్మూలించివేస్తా'నని అతడు రాజులందరిమధ్యనీ ప్రతిజ్ఞచేశాడు.

ఈ ప్రతిజ్ఞ నెరవేర్చుకునే తలంపుతో సాల్వుడు, ఈశ్వరుణ్ణిగురించి ఘోర తపస్సు అరంభించాడు. అతని తపస్సుకు మెచ్చి ఈశ్వరుడు ప్రత్యక్షంకాగా,—'సుర అసుర నర గంధర్వ ఉరగాదులకు అభేద్యమైనటువంటిదీ, కామగమనము కలదీ, ఒక విమానం కావా'లని వేడుకొన్నాడు. వెంటనే ఈశ్వరుడు విశ్వకర్మకు అజ్ఞాపించాడు. విశ్వకర్మ 'సౌభవిమాన'మనేదాన్ని సృష్టించి సాల్వుడికిఇచ్చాడు.

సౌభవిమానం వచ్చినప్పటినించీ సాల్వుడిని పట్టపగ్గాలు లేకపోయినై. దానిపైన ఎత్తివెళ్లి ద్వారకను ముట్టడించి ధ్వంసం చేయసాగాడు. విమానంపైనుండి శిలావర్షం కురిపించి, ప్రజకు క్షోభకలిగిస్తూవచ్చాడు. అప్పుడు, వాడి దుర్నయాలను అణిచివేయాలని తలిచి ప్రద్యుమ్నుడు యుద్ధానికి తలపడ్డాడు. ఐతే—సాల్వుడు తన విమానాన్ని బహురూపాలుగా తిప్పి, దాగుకొనీ—పైకివచ్చీ—భూమితాకీ — కొండలపైకిపోయీ — అనేకమాయలు అగపరుస్తూ చిక్కులు పెట్టాడు. ప్రద్యుమ్నుణ్ణి మూర్ఛకూడా పోగొట్టాడు.. ప్రద్యుమ్నుడు తేరుకొని అతి పౌరుషంతో ఇరవైఏడురోజులు యుద్ధంసాగించి, చాలవరకు సాల్వుని సేననూ, ముఖ్యనాయకులనూ పరిమార్చాడు.

ఇంతలో—ధర్మరాజు చేసే రాజసూయయాగానికి వెళ్లిన శ్రీకృష్ణుడు తిరిగి వస్తున్నాడు. అతడు బయల్దేరేసరికి దుశ్శకునాలు కనబడినై. సరి, సాల్వుని సమాచారం తెలుసుకుని, యుద్ధరంగానికి చేరుకొన్నాడు. ఊరకున్నకొద్దీ సాల్వుని దుండగాలు మితిమీరిపోవటంచూచి, శ్రీకృష్ణుడు సాల్వుని తాకి, సౌభవిమానాన్ని నూరుముక్కలుగా నరికి, బాణాలతో కొట్టగా మేఘాలు అవరించినై. ఆ చీకటిలో నుండి సాల్వుడు సూర్యబింబంలాగా ఇవతలికివచ్చి కృష్ణుణ్ణి దూషింపసాగాడు. అప్పుడు భగవానుడు గదయెత్తి మూపులసందున వేసేటప్పటికి వాడు నెత్తురు గ్రక్కుకొని చచ్చిపోయాడు.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st MAR. '52
6 అ

అట్టమీది బొమ్మ

కౌరవులకూ పాండవులకూ మధ్యని యుద్ధం పొసగుతుందనే వార్త బలరాముని చెవినిపడింది. అతనికి ఏ పక్షమందు చేరటానికీ ఇష్టంలేకపోయింది. మధ్యస్థుడుగా వుండటమే మంచిదనే వుద్దేశంతో, తీర్థయాత్ర నెపంమీద బయల్దేరాడు. అనేక నదులలో మునిగి, తీర్థాలు సేవించుకొంటూ నైమిశారణ్యం ప్రవేశించాడు.

అక్కడ తపస్సులో మునిగిఉన్నటువంటి మునీశ్వరులందరూలేచి, బలరామునికి ప్రణమిల్లి, ఆ మహాత్ముణ్ణి బహువిధాల పూజించి గౌరవించారు. మునులందరూ అతన్ని పూజించారుకాని, రోమహర్షణుడనే ఋషిమాత్రం, బలరాముని గౌరవార్థం కూర్చున్నవాడు లేవనైనాలేదు.

'ఏమిటీ పాపాత్ముడి పొగరు!' అని చెప్పి బలరాముడు ఉగ్రుడై, చేతనున్న కుశాగ్రంతో ఆ రోమహర్షణుడ్ని తెగటార్చివేశాడు. అప్పుడు మునిబృందంలో హాహాకారాలు చెలరేగినై. 'మహనుభావా!'—లోకపావనుడవైనటువంటి నీవే ఇలా తొందరపడితే ఏమనుకోవాలి? నీకిప్పుడు బ్రహ్మహత్యాపాతకం చుట్టుకున్నదే...!' అంటూ ఋషులు తమ కలవరాన్ని వెల్లడించారు.

అందుకు బలదేవుడు 'తగిన ప్రాయిశ్చిత్తం మీరే విధించండి. అనుభవించటానికి సిద్ధంగా వున్నా'నని పశ్చాత్తాపం తెలిపాడు. ఇది విని మునులు, "మహాత్మా! ఇల్వలుని కొడుకు పల్వలుడనే రాక్షసుడు ఉన్నాడు. వాడు ప్రతిపర్వమందూ వచ్చి మమ్మల్ని దూషించి, హింసిస్తూవుంటాడు. వాడిని హతమార్చినట్టయితే మాకేకాదు, లోకానికే గొప్ప మేలుచేసినవాడవు అవుతావు. ఐతే—వాడిని చంపటం పాపంకదా? అని అడగవచ్చు. దానికీ ఒక ప్రతిక్రియ వున్నది. వాణ్ణి వధించి తరువాత పన్నెండు నెలలు భారతదేశమంతటా తీర్థయాత్రలు సేవించినపక్షమందు పాపవిముక్తి ఐపోతుంది' అని వారు చెప్పగా, బలరాముడు ఘోరాకారంలో వుండే పల్వలుణ్ణి పట్టి యీడ్చి, ముసలంతో తలపైన అణచేసరికి ఆ ద్రోహి నెత్తురు గ్రక్కుకొంటూ, పర్వతంలాగ నేలగూలి, ప్రాణంవిడిచాడు.

ఈ విధంగా బలరాముడు మునుల ఆజ్ఞప్రకారం దుష్టసంహారం చేసి, వారి సెలవు తీసికొని తీర్థయాత్రలకు వెళ్లిపోయాడు.


చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st APR. '53
6

అట్టమీది బొమ్మ

కుచేలుడు ఒక పేదబ్రాహ్మడు. అతడు జితేంద్రియుడూ, కలిగినదానితో తృప్తిచెందేవాడున్ను. ఐతే దారిద్ర్యానికితోడు కుచేలునికి గంపెడు పిల్లలు. ఈ పిల్లలతో కుటుంబం ఈదుకోవటం దుర్ఘటంగా ఉండేది.

కుచేలుడూ కృష్ణభగవానుడూ బాల్యమిత్రులు, సహపాఠులున్ను. ఒకనాడు కుచేలుని భార్య, భర్తతో "నాథా!—కేవలమూ ఆ లక్ష్మీపతి మీకు సఖుడుకదా! ఆయన శరణాగత రక్షకుడని బిరుదు పొందినవాడే! ఒక్కసారి పోయి ఆ మహానుభావుని దర్శనంచేయకూడదా? ఆయన తలచినంతలో మన దారిద్ర్యం పటాపంచలగునే!" అని వినయంగా కోరింది.

ఈ రూపకంగానైనా దేవదేవుని సందర్శనభాగ్యం కలుగుతుందని తలిచి కుచేలుడు అంగీకరించాడు. భగవానుడివద్దకు పోవాలంటే ఎటువంటి బహుమతులు తీసుకువెళ్ళాలి! ఏమీ తోచక కుచేలుడిభార్య నాలుగిళ్లకుపోయి నాలుగు పిడికెళ్లు అటుకులు దండితెచ్చి, వాటిని జాగ్రత్తగా మూటకట్టి భర్తకు ఇచ్చింది.

కుచేలుడు ఆ మూటను భక్తితో చేతపట్టుకొని కృష్ణుడు నివసించే ద్వారకా నగరం చేరుకున్నాడు. కుచేలునిరాక తెలియగానే శ్రీకృష్ణుడు శయ్యా దిగివచ్చి బాల్యమిత్రుని స్వయంగా తోడ్కొనివెళ్ళి తనపక్కమీద కూర్చోపెట్టుకున్నాడు. ఉభయులూ మనసువిడిచి కుశలప్రశ్నలు వేసుకొన్నారు. చిన్ననాటి ముచ్చటలూ, చదువుకొనేనాటి చిలిపిచేష్టలూ జ్ఞాపకంతెచ్చుకొన్నారు. కుచేలునికి శ్రీకృష్ణుడు పాదసేవ చేశాడు, రుక్మిణి వీవనతో విసిరింది. చివరకు కృష్ణుడు 'ఏమిటోయి కుచేలా!—మరి నాకేం తెచ్చిపెట్టావు?' అంటూ, అతనిచేతిలోని మూటవిప్పి, ఆప్యాయంతో ఆ అటుకులు తిన్నాడు. ఇదిచూచి అందరూ విస్మయం పొందారు.

మరునాడు కుచేలుడు తన గ్రామం చేరుకొనేసరికి తన పూరిల్లు ఒక దివ్యసౌధంగా మారిపోయింది. మెడబొందుతో వుండిన అతని భార్య సమస్తమైన అభరణాలతోనూ తులతూగుతున్నది. కృష్ణుని మహిమవల్ల ప్రాప్తించిన ఈ ఐశ్వర్యం అనుభవిస్తూ, కుచేలుడు సుఖంగా వున్నాడు. ఇంత ఐశ్వర్యం వచ్చినా భగవంతుని మరువక, అజన్మాంతమూ కృష్ణభక్తుడుగా ఉండి తరించాడు.

చందమామ
పిల్లల కథల
MAY '52
6

అట్టమీది బొమ్మ

శ్రీకృష్ణ బలరాములు విద్యలు నేర్చుకోవటం పూర్తికాగానే గురువువద్ద సెలవు తీసుకొంటూ, 'మేము మీకు ఈయగల దక్షిణ యేమిటో దయచేసి చెప్పండి' అని కోరారు. అందుకు గురువు 'అవతారపురుషులయినటువంటి మీరు నాకు ఈయతగిన ప్రతిఫలం ఒక్కటేవున్నది. చచ్చి స్వర్గానవున్న నా పుత్రుణ్ణి నాకు ప్రసాదించాలి' అంటూ తన కుతూహలం వెల్లడించాడు. అప్పుడు కృష్ణ బలరాములు ముల్లోకాలూ వెతికి, గురుపుత్రుణ్ణి పట్టితెచ్చి వప్పగించారు. గురువు సంతోషానికి మేరలేకపోయింది.

ఈ వార్త చెవినిపడగానే దేవకీదేవి విస్మయంపొందింది. ఆమెకు వెంటనే కంసుడు హింసించిన తన కుమారులు జ్ఞాపకానికి వచ్చి కన్నులవెంట జలజల బాష్పాలు రాలినై. అప్పుడామె రామకృష్ణులను పిలిచి, అతిదీనంగా "నాయనా!— నా కడుపున పుట్టిన మీరు భూభారం హరించటానికని వచ్చిన అవతారపురుషులన్న సంగతి ఎరుగుదును. మీకు అసాధ్యమనేది యేదీలేదని తెలుసు. ఏనాడో చచ్చిపోయిన పుత్రుని వెతికితెచ్చి గురుదక్షిణగా అర్పించినసంగతికూడా విన్నాను. కంసుడు వధించిన నా బిడ్డలను చూపించి పుణ్యంకట్టుకోరా?" అని కోరింది.

వెంటనే బలరామకృష్ణులు సుతలానికి చేరుకొన్నారు. అక్కడ ఇంద్రసేనుడు పరమ అహ్లాదంతో రామకృష్ణులను గౌరవించి, సమస్త ఉపచారాలూచేసి, "మహానుభావులారా!—దుర్లభమైన మీ దర్శనభాగ్యం మాకు లభించింది. ధన్యులమయ్యాము. మమ్మలిని అనుగ్రహించండి" అని ప్రార్థించారు.

అప్పుడు భగవానుడు "మహారాజా!—మొదట స్వాయంభువ మన్వంతరమందు అరుగురు కుమారులు జన్మించి శాపవశాన రాక్షసులై హిరణ్యకశిపునకు పుట్టారు. ఆ తరువాత వారు దేవకి గర్భమందు జన్మించి వాళ్లను కంసుడు హింసించగా, ఇక్కడికి వచ్చివున్నారు. వీళ్లకోసం మా తల్లి శోకిస్తున్నది కాబట్టి మేము వీళ్లను తీసుకొనిపోదలిచాము. నా అనుగ్రహంవల్ల వీళ్లకు శాపంపోయి సద్గతులు పొందుతారు" అని చెప్పాడు.

అప్పుడు ఇంద్రసేన మహారాజు స్మరుడు, ఉదీథుడు, పరిష్వంగుడు, పతంగుడు, క్షుద్రభువు, ఘృణి అనే అర్గురనూతెచ్చి వప్పగించేసరికి, శ్రీకృష్ణపరమాత్మ వాళ్లను వెంటబెట్టుకువెళ్లి తల్లియెదట ఉంచాడు. దేవకీదేవి మృతసుతుల రాకకు ఎంతగానో ఆనందించి, కృష్ణమాయకు ఆశ్చర్యపడింది.

చందమామ
పిల్లల కథల మాసపత్రిక
1st JUNE '52
6
M.T.V.Acharya

అట్టమీది బొమ్మ

దివ్యమంగళమూర్తి ఐనటువంటి శ్రీకృష్ణపరమాత్మ ద్వారకలో ఉంటూ, ఒకనాడు "నేను జన్మించిన యాదవకులం ఉపసంహరించివేస్తేకాని, ఈ అవతారమెత్తిన ప్రయోజనం పూర్తికాదు" అని తనలో అనుకోసాగాడు.

కృష్ణుడు ఇలా ఆలోచిస్తూవుండగా విశ్వామిత్రుడు, అసితుడు, కణ్వుడు, దూర్వాసుడు, భృగువు, అంగరస్సు, కాశ్యపుడు, వామదేవుడు, అత్రి, వసిష్ఠుడు, నారదుడు మొదలైన మునులందరూ ఆయన దర్శనానికి వచ్చారు. వచ్చి, కృష్ణుని ఆజ్ఞప్రకారం పిండారకక్షేత్రం చేరుకొన్నారు.

అక్కడ యదుకుమారులు, నీతితప్పి ఇష్టారాజ్యంగా వర్తిస్తూవున్నారు. వాళ్ళ జులాయితనానికి మితీ మేరా లేకుండా వున్నది. క్షేత్రానికివచ్చిన మహర్షులందరనూ చూడగానే, ఒక వేడుకచేదామని వాళ్ళకు బుద్ధిపుట్టింది. వెంటనే, సాంబుడనే కుర్రవాడికి చూలాలువేషంవేసి, ఆ ఋషులయెదుట నిలబెట్టారు. నిలబెట్టి అతి వినయంగా పాదప్రణామం ఆచరించి "మహాత్ములారా!—మీరు త్రికాలజ్ఞులుకదా! ఈ స్త్రీకి ఏమిబిడ్డ కలుగుతుందో తెలుసుకోవాలెనని కుతూహలంగా ఉన్నదట. ఆమె అడగటానికి సిగ్గుపడుతున్నది, కాబట్టి మేమడుగుతున్నాము. దయచేసి చెప్పండి" అన్నారు.

మునులకు అరికాలిమంట నెత్తికెక్కింది. 'దానికేముంది అబ్బాయిలూ!—మంచిప్రశ్నే అడిగారు. ఈ అమ్మాయి కులనాశనంచేసే ఒక ముసలాన్ని ప్రసవిస్తుంది. ఇక వెళ్ళండి' అన్నారు. వారు సాంబుడి వేషం విప్పేసరికల్లా అందులో నిజంగానే ఒక ముసలం వున్నది! అయోమయమైపోయింది యదుకుమారులకు. భయంతో తల్లడిల్లిపోయారు వాళ్ళు. చేసేదిలేక, గురువాజ్ఞప్రకారం ఆ ముసలం అరగదీసి పొడిగా చేసి, దాన్ని సముద్రంలో కలిపారు. ఎంత అరగదీసినప్పటికీ ఆ ముసలం పూర్తిగా నాశనంకాక, అంకుశంమొనవంటి సన్నపాటిముక్క మిగిలేపోయింది. ఇదే శ్రీకృష్ణుని నిర్యాణానికి కారకమయింది.

పోతే,—వాళ్ళు చూర్ణంచేసి సముద్రంలో కలిపిన ముసలం వ్యాపించినంత మేరా, తీరాన ఒకవిధమైన రెల్లుగడ్డి మొలిచింది. సూదిమొనలకంటే వాడిగా ఉండే ఆ గడ్డితోనే చివరకు యాదవకుమారులు జగడమాడి, ఒకరినొకరు కొట్టుకోగా వారి కులం నాశనమై, ఋషుల శాపం ఫలించింది.